ప్రజాశక్తి

సోమవారం 7 ఆగష్టు 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల







ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి మన్మథరావు

న్యాయవ్యవస్థ ప్రతిష్టను కాపాడుకోవాలి

హైకోర్టు న్యాయమూర్తి మన్మథరావు

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రజల్లో మరింత నమ్మకం కలిగించేలా న్యాయ వ్యవస్థను న్యాయమూర్తులు, న్యాయవాదులు సమన్వయంతో పనిచేసి కాపాడుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి కె.మన్మథరావు సూచించారు. మార్కాపురం కోర్టు ప్రాంగణంలో నాలుగు కోర్టుల్లో రెండు కోర్టులు అధునాతన భవనాలు కలిగి ఉండగా... మరో రెండు కోర్టులకూ అన్ని హంగులతో నూతన భవన నిర్మాణాలకు గానూ రూ.6 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో నిర్మాణ పనులు ప్రారంభించేందుకు హైకోర్టు న్యాయమూర్తులు కె.మన్మథరావు, జి.రామకృష్ణప్రసాద్, ఎవి.రవీంద్రబాబు ఆదివారం స్థానిక ▶ 3లో

సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసే బాధ్యత టిడిపిదే..

- ప్రాజెక్టులపై వైసిపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు
- గేటు కొట్టుకుపోతే పెట్టలేని వైసిపి ప్రభుత్వం
- బహిరంగ సభలో మాజీ సిఎం చంద్రబాబునాయుడు విమర్శలు



మాట్లాడుతున్న టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టలను పూర్తి చేసే బాధ్యత తెలుగుదేశం పార్టీదేనని మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అవినీతి చేయటం తప్ప అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టలపై వైసిపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టల విధ్వంసంపై యుద్ధభేరీ కార్యక్రమంలో ఆయన ఆదివారం మద్దిపాడు మండలం మల్లవరంలోని కందుల ఓబుల్ రెడ్డి గుండ్లకమ్మ ప్రాజెక్ట్‌ను సందర్శించారు. అనంతరం అక్కడే జరిగిన బహిరంగ సభకు సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బిఎన్ విజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని రంగాలలో విధ్వంసం తప్ప అభివృద్ధి ఎక్కడా కానరావటం లేదన్నారు. అదేమని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించటం, జైళ్లకు పంపటం చేస్తోందన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్‌ను తాను సందర్శించానని, కొట్టుకుపోయిన గేటును తిరిగి ఏర్పాటు చేయటం వైసిపి ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి అంబటి రాంబాబు కోటి రూపాయలతో గేటు నిర్మించలేకపోయారని, బ్రో సినిమాను విమర్శిస్తున్నారన్నారు. మంత్రి అంబటి రాంబాబు నోరుపారేసుకుంటే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. గేటు కొట్టుకుపోతే సంతనూతలపాడు ▶ 2లో

'అంబటి' గిద్దలూరులో పోటీ చేస్తాడేమో..?

మంత్రి అంబోతు రాంబాబు(అంబటి రాంబాబు)కి సత్తెనపల్లిలో సీన్ అయ్యిందని, ప్రకాశం జిల్లా గిద్దలూరులో పోటీ చేస్తాడేమోనని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. బహిరంగ సభలో చంద్రబాబు నాయడు మాట్లాడుతూ మంత్రి రాంబాబు రంకెలు వేయటం, నోరు పారేసుకోవటం మానుకోవాలని, లేకపోతే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. మంత్రి అంబటి గిద్దలూరులో పోటీ చేస్తే.. ఆయనను ఓడించి.. పంపాలని పిలుపునిచ్చారు.

మత్తు పదార్థాలను నిషేధించాలి

- మహిళలపై హింసను ప్రేరేపించే చిత్రాలను నిలిపేయాలి
- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి



మాట్లాడుతున్న రమాదేవి

ప్రజాశక్తి-వేటపాలెం

మద్యం, మత్తు పదార్థాలను నిషేధించేందుకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న మహిళల పోరు యాత్రలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఆదివారం మండల పరిధిలోని దేశాయిపేట పంచాయతీ కాలనీకి హింసపై మహిళల పోరుయాత్ర జాతా విచ్చేసింది. ఈ సందర్భంగా సిలోన్ కాలనీ మహిళా సంఘం ఆధ్వర్యంలో యాత్రకు ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వం మీడియా మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసి.. హింస, అసమానతలను ప్రేరేపించే చలనచిత్రాలు, టీవీ సీరియల్స్, ఇంటర్నెట్ కార్యక్రమాలను నిషేధించాలన్నారు. హింసను రెచ్చగొడుతున్న బిజెపిని గద్దె దించేందుకు మహిళలందరూ పోరాడాలని పిలుపునిచ్చారు. దేశంలో రాష్ట్రంలో చిన్నారులు మహిళలపై హింస రోజురోజుకీ విపరీతంగా పెరుగుతోందన్నారు. ముందుగా మహిళలను ఉద్దేశించి ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కళాజాతా గేయాలు ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర నాయకురాలు సావిత్రమ్మ, ప్రజాసంఘాల నాయకులు ఎన్ బాబురావు, పి కొండయ్య, శివనాడియన్, సత్యవేలు అయ్యప్పరెడ్డి, మహిళా నాయకురాలు సువర్ణ అల్లిరాణి పాల్గొన్నారు.

బాపట్ల: మహిళల పోరు యాత్ర జాతా ఆదివారం రాత్రి బాపట్లకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక నాయకులు జాతాకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, కాంగ్రెస్ నాయకురాలు రేణుక, సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, సిఐటియు కార్యదర్శి, మజుందార్, సామేలు ఐద్వా జిల్లా నాయకురాలు సుభాషిణి, ఎస్ఎఫ్ఐ నాయకులు ఆర్య, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి

రైల్వేస్టేషన్ల ఆధునీకరణతో కొత్త చరిత్రకు శ్రీకారం


ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ▶ 8లో

చరిత్ర నుండి పాఠాలు నేర్చుకోవాలి

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురామ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోకపోతే ఆ చరిత్ర గుణపాఠం నేర్పుతుందని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురామ్ తెలిపారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో ఆదివారం కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చుండూరు మృతవీరుల 31వ సంస్మరణ సభ జరిగింది. కార్యక్రమానికి కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు అట్లూరి రాఘవులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బి. రఘురామ్ మాట్లాడుతూ జరిగిన చరిత్ర నుండి పాఠాలు నేర్చుకుని, అందుకు తగిన వ్యూహాలను నిర్మించుకుంటూ భవిష్య పీడిత కులాల నాయకత్వం ముందుకు వెళ్లవలసిన అవసరం ఉందన్నారు. అలా ముందుకు వెళ్లడానికి స్ఫూర్తినిచ్చే క్రమంలో తమ ప్రాణాలు త్యాగం చేసిన చుండూరు అమర వీరుల నివాళులు అర్పిస్తూ. నేడు మనం ముందుకు సాగాలని వారు తెలిపారు. చుండూరు మారణ హోమం



సంస్మరణ సభలో మాట్లాడుతున్న బి.రఘురామ్

1991 ఆగస్టు 6వ తేదీన గుంటూరు జిల్లా చుండూరు గ్రామ దళితులపై పెత్తందారులు దాడి జరిపి 8 మంది దళితులను నరికి చంపివేశారని, ఆ సంఘటనపై అనేక విప్లవ, ప్రజాసంఘాలు, దళిత సంఘాలు, హక్కుల సంఘాలు చేసిన పోరాటం ఫలితంగా చుండూరు మారణకాండపై అదే గ్రామంలో ప్రత్యేక న్యాయస్థానాన్ని ప్రభుత్వం ఏర్పరచి విచారణ సాగించింది అని తెలిపారు. సుదీర్ఘ విచారణ అనంతరం ఈ న్యాయస్థానం 21 మందికి జీవిత ఖైదును, 35 మందికి ఏడాది జైలుశిక్షను విధిస్తూ తీర్పునిచ్చిందన్నారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజ్యాంగం ఇచ్చిన సర్వమానవ సమానత్వ స్ఫూర్తితో కల్పించబడిన ప్రాతినిధ్య హక్కుల అమలులో పాలక వర్గాలు ఎన్నో అవాంతరాలు కల్పించనప్పటికీ., దళితులు విద్యా సముపార్జన ద్వారా ఒక చైతన్యవంతమైన సమాజంగా పరిణామం చెందడం ఎంత అవసరమని తెలియజేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు టి. రామారావు, వి. మోజేష్, అత్తంటి శ్రీనివాసరావు, జేసు రత్నం, రాజశేఖర్, కత్తి యోబు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసే బాధ్యత టిడిపిదే..

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యేకు చీమకుట్టినట్లు అయినా లేదని, ప్రాజెక్ట్ కింద ఇసుకను ఆయన అనుచరులు దోచుకుపోతున్నారన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్ గేటు కొట్టుకుపోతే కోటి రూపాయలతో గేటు పెట్టలేని స్థితిలో వైసిపి ప్రభుత్వం ఉందన్నారు. వైసిపి ప్రభుత్వానికి ప్రజలంటే లెక్కలేనితనం, బాధ్యత లేని ప్రవర్తనతో ఉందన్నారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి కాక 5 లక్షల ఎకరాలలో వరి సాగు తగ్గిందని, 9 లక్షల మెట్రిక్‌టన్నుల వరి ఉత్పత్తి తగ్గిందన్నారు. విద్య, ఆరోగ్యం, వైద్యం, అభివృద్ధి వంటి అంశాలలో రాష్ట్రం వెనకబడిపోయిందన్నారు. వెలుగొండ ప్రాజెక్టుకు తాను శంకుస్థాపన చేశానని, ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే వెలిగొండ ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గత టిడిపి హయాంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి రూ.68 వేల కోట్లు ఖర్చు చేస్తే, వైసిపి ప్రభుత్వం కేవలం రూ.22 వేల కోట్లు కేటాయించిందన్నారు. సాగునీటిని రైతులకు ఇస్తే వారు సిరులు పండిస్తారని, వైసిపి ఈ విషయమై పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. నదుల అనుసంధానం ద్వారా ప్రతి ఒక్కరికి నీళ్లు ఇస్తామన్నారు. తమ హయాంలో పోలవరం ప్రాజెక్ట్‌ను 72 శాతం పూర్తి చేస్తే, వైసిపి ప్రభుత్వం డయా ఫ్రం వాల్ కూలిపోయిందని, కాఫర్ డ్యామ్ కొట్టుకుపోయిందన్నారు. గోదావరి నదిలో నీళ్లు ఉన్నా కృష్ణా నదికి నీళ్లు ఇవ్వలేని స్థితిలో వైసిపి ప్రభుత్వం ఉందని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు రూ.3 వేలు భృతి ఇస్తామని, 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. పరిశ్రమలను స్థాపించి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించటంతో పాటు రాష్ట్ర ఆదాయాన్ని పెంచుతామన్నారు. మహిళలను అన్ని విధాలా ఆదుకుంటామని సూపర్ 6లో అమ్మకు వందనం, ఆడ బిడ్డ నిధి, మహిళలకు ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసి ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. బిసిలకు ప్రత్యేక సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయిస్తామన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలను గౌరవిస్తూ పి4 పాలసీ తీసుకొస్తామన్నారు. రాష్ట్రంలో రౌడీ రాజకీయం పెరిగిపోతుందని, టిడిపి అధికారంలోకి రాగానే రాజకీయ రౌడీలకు వడ్డీతో సహ చెల్లిస్తామన్నారు. గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రం అన్ని రంగాలలో వెనకబడిపోయిందని, టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే దేశంలోనే నెంబర్ 1 రాష్ట్రంగా చేస్తామని హామీ ఇచ్చారు. పోలీసులను సైతం ఆదుకుంటామని వర్క్ ఫ్రం హోం చేపట్టి వారి అభివృద్ధికి పాటుపడతామన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసే బాధ్యత తీసుకుంటుందన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే ప్రకాశం జిల్లాలోని ప్రాజెక్టులను పూర్తి చేసే ప్రజలకు సాగు, తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రకాశం జిల్లా ప్రజలు ఆలోచించి సైకో ప్రభుత్వాన్ని దించి 2024 ఎన్నికలలో టిడిపిని గెలిపించాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధి కోసం తాను ఏమి చేసేందుకైనా సిద్ధమని నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య, మాజీ ఎంపి శ్రీరాం మాల్యాద్రి, అద్దంకి, పర్చూరు ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, ఏలూరి సాంబశివరావు, ప్రకాశం జిల్లా టిడిపి ఇన్‌చార్జి నూకసాని బాలాజి, టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, బిఎన్ విజయ కుమార్, కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి రాజేష్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల చట్ట సవరణను ప్రతిఘటించండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ఆంజనేయులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

అసైన్డ్ భూములను రియల్ ఎస్టేటర్లు, ఆక్రమణదారులు, భూస్వాములకు కట్టబెట్టడానికి గవర్నర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్ 9/2023ని రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక రంగారాయుడు చెరువు వద్ద ఈ ఆర్డినెన్స్ కాపీలను వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తలు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఈ ఆర్డినెన్స్‌తో పేదలు, దళితులు, గిరిజనులకు నష్టం జరుగుతుందన్నారు. స్వాతంత్రానికి పూర్వం నుండే దేశంలో దున్నేవానికి భూమి దక్కాలని అనేక పోరాటాలు జరిగాయని తెలిపారు. స్వాతంత్ర్య అనంతరం కూడా ప్రత్యక్ష పోరాటాలు, పార్లమెంట్‌లో జరిగిన చర్చల ఫలితంగా భూసంస్కరణల చట్టాలు వచ్చాయని తెలిపారు. స్వాతంత్రానంతరం దేశంలో వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్న పేదలకు ప్రభుత్వాలు భూ పంపిణీ చేశాయని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 54 లక్షల ఎకరాల భూములు పేదలకు ప్రభుత్వాలు పంచాయన్నారు. ప్రభుత్వాలు పేదలకు పంచిన భూములన్నిటిని అసైన్డ్ భూములు అంటారన్నారు. 9/77 చట్టం ప్రకారం ప్రభుత్వం పేదలకు పంచిన భూములు అమ్మకూడదు, కొనకూడదని, అమ్మిన వారు కొన్నవారు శిక్ష అర్హులని తెలిపారు. చట్టం అమలులో ఉన్నా కూడా పెద్ద సంఖ్యలో పేదల వద్ద ఉన్న భూములు ఆక్రమణలకు గురయ్యాయని కోనేరు రంగారావు కమిషన్ వివరించిందన్నారు. నేడు వైసిపి ప్రభుత్వం ఉన్న ఆ కొద్దిపాటి చట్టాన్ని పూర్తిగా ఆక్రమణదారులకు అనుకూలంగా మారుస్తున్నదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నట్లు అసైన్డ్ భూములు పొందిన పేదలకు భూమి మీద హక్కు కల్పించడం వారికి మంచిదేనని, ఆ పేరుతో అమ్మకం కొనుగోలుకు అవకాశాలు కల్పించరాదన్నారు. ఆర్డినెన్స్ 9 / 2023 పేదలను నిరుపేదలుగా మారుస్తుందని తక్షణమే దాని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు,, జిల్లా నాయకులు కంకణాల వెంకటేశ్వర్లు, ఉబ్బా వెంకటేశ్వర్లు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి రఘురాం, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు సిహెచ్ వినోద్, కె ఎఫ్ బాబు, వి మోజస్, .ఆర్ శ్రీను పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి -గిద్దలూరు రూరల్

గిద్దలూరు శ్రీ వివేకానంద సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో 1983– 88 విద్యా సంవత్సరాల్లో చదివి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. అనంతరం స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అమ్మ వద్దాశ్రమం, సంజీవని వద్దాశ్రమం, మానసిక వికలాంగుల పాఠశాలలకు నిత్యావసరాలు అందజేశారు. ఈ సందర్భ:గా ఆత్మీయ సమ్మేళనం నిర్వాహకులు తులసి బాబు మాట్లాడుతూ శ్రీ వివేకానంద సైన్స్ అండ్ ఆర్ట్స్ కాలేజ్‌లో 1983– 88 విద్యాసంవత్సరాల్లో చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం గత ఐదు సంవత్సరాలుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి. హనుమంత రెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

25 రోజుల్లో 12 మంది మృతి

- వరుస ప్రమాదాలతో బెంబేలెత్తుతున్న ప్రయాణీకులు
- అధికారుల నిర్లక్ష్యమే కారణమా..?

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి కేంద్రంగా వరుస ప్రమాదాలతో సుమారు 25 రోజుల వ్యవధిలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ మృతుల్లో అత్యధికులు అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రాణాలు కోల్పోయారంటే ప్రభుత్వ యంత్రాంగం వైఖరి స్పష్టంగా కనిపిస్తోంది. గత నెల11వ తేదీ మంగళవారం తెల్లవారుజామున దర్శి వద్ద సాగర్ కాలువలోకి బస్సు దూసుకెళ్లిన సంఘటనలో పొదిలికి చెందిన ముస్లింలు ఏడుగురు మృతి చెందారు. పదుల సంఖ్యలో తీవ్రంగ గాయపడ్డారు. ఈ సంఘటనకు రహదారులు, భవనాలశాఖతో పాటు గ్రామీణ నీటిసరఫరా ఇతర శాఖల అధికారులు బాధ్యులుగా ప్రజలు భావించారు. అదేవిధంగా ఆ మరుసటి రోజు పొదిలి పట్టణంలోని కాటూరివారిపాలెం వద్ద నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ నిర్మాణంలో భాగంగా డైవర్షన్ రోడ్డు కోసం రహదారికి అడ్డంగా పోసిన మట్టికుప్పను గమనించని యువకుడు షేక్ షాబుద్దీన్(22) దానిని ఢీ కొట్టి తారురోడ్డుపై పడిపోయాడు ఈ సంఘటనలో యువకుడు తీవ్రంగా గాయపడి గుంటూరులో చికిత్స పొందుతూ ఈ నెల 6వ తేదీ ఆదివారం మరణించాడు.


షేక్ షాబుద్దీన్ (ఫైల్)

జులై నెల 13వ తేదీన మండలంలోని కంభాలపాడు గ్రామానికి చెందిన వైఎస్ఆర్ పార్టీ యువనాయకుడు నాగిరెడ్డి రాఘవరెడ్డి(33) చీమకుర్తి బైపాస్ వద్ద ట్రాక్టర్‌ను గమనించక కారు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అదే నెల 15వ తేదీన కంభాలపాడు పరిధిలోని గ్రామ పోలాల్లో సచివాలయం అసిస్టెంట్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న అలవల వెంకటనారాయణ విద్యుత్‌షాక్‌తో దుర్మరణం చెందాడు. ఈ సంఘటనలో విద్యుత్ సిబ్బంది, అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఇక్కడ ప్రమాదం జరిగిన వారం రోజుల వరకు ఇతర లైన్‌లను అధికారులు సరిచేయకపోవడంతో మరో వారం రోజులకు అదే గ్రామ పోలాల్లో సుమారు లక్ష రూపాయల గేద విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. మరో 10 రోజల వ్యవధిలోనే మండలంలోని అన్నవరం గ్రామంలో యువ రైతు పోలంలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలకు బూచిరాజు చిరంజీవి(33) ప్రాణాలు కోల్పోయాడు. ఈ మరుసటి రోజు పట్టణంలో టిప్పర్‌ను అధిగమించే క్రమంలో మంగాపురంలో నివాసం ఉంటున్న విజయవాడ యువకుడు అత్యంత దుస్థితిలో గాయపడి మృత్యువు ఒడి చేరాడు. ఇలా ప్రతి రెండు రోజులకు ఒక ప్రమాదంతో వరుస సంఘటనలతో యువకులు మృతి చెందుతున్నారు.

పొదిలి పట్టణంలో పాతూరు ప్రధాన రహదారిలో మహలక్షమమ్మ దేవాలయం వద్ద జరిగిన (ఒంగోలు కర్నూలు రహదారిపై) రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడుతీవ్రంగా గాయపడి ప్రాణాపాయస్థితికి చేరిన సంఘటన శనివారం జరిగింది. పాతూరు పెద్ద బస్టాండ్ సెంటర్ నుండి చిన్న బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను విజయవాడకు చెందిన యువకుడు, ప్రస్తుతం కొనకనమిట్ల మండలం మంగాపురంలో నివాసం ఉంటున్న కొల్లు రాంబాబు తన స్కూటర్‌పై వెళ్తూ ఢీ కొట్టాడు. ఈసంఘటనలో రాంబాబుపైకి టిప్పర్ చక్రం ఎక్కడంతో నడుము, కుడికాలు నుజ్జునుజ్జు అయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి రాంబాబును అంబులెన్స్ ద్వారా అత్యవసర చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించారు. పొదిలి ఎస్ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఒక వైపు పోలీసులు శనివారం నో యాక్సిడెంట్ డే పేరుతో రహదారులపై తనిఖీలు నిర్వహిస్తుండగా కేవలం గంటల వ్యవధిలో ఈ ప్రమాదం జరగడం, పోలీసులు మొక్కుబడిగా చేస్తున్న చర్యల పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

తాతయ్య ప్రేరణ - వాసన్నతో ప్రయాణం

బన్నీ రాజకీయ ప్రస్థానం.....

ప్రజాశక్తి - ఒంగోలు

తాతయ్య బూతలపల్లి రామసుబ్బారెడ్డి ప్రేరణ, మాజీమంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డితో 35ఏళ్ల ప్రయాణం తన రాజకీయాలకు బాసటగా నిలిచినట్లు యనమల మారుతీ ప్రసాద రెడ్డి (బన్నీ) అభిప్రాయపడ్డారు. పిడిసిసి బ్యాంక్ చైర్మన్‌గా సోమవారం బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా ఆయన తన అనుభవాలను ప్రజాశక్తితో పంచుకున్నారు.

కుటుంబ నేపథ్యం రాజకీయాలకు ప్రేరణ

కనిగిరికి చెందిన యనమల అంజిరెడ్డి, సరోజల దంపతులకు 1969 సెప్టెంబర్ 18న ప్రసాదరెడ్డి జన్మించారు. ఈయన ఇంటర్ వరకు కనిగిరిలోనే అభ్యసించారు. ఆయన తండ్రి అంజిరెడ్డి ఇరిగేషన్ శాఖలో డిఇఇగా పనిచేశారు. ఆయన తాతయ్య బూతలపల్లి రామసుబ్బారెడ్డి 1978-1985 కాలంలో కనిగిరి ఎమ్మెల్యేగా కొనసాగారు. ఈ కాలంలో కనిగిరి ప్రాంతంలో పలు అభివద్ధి పనులు చేపట్టారు. అనేక మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు.

విద్యార్థి దశలో కాంగ్రెస్ రాజకీయాల్లోకి..

కనిగిరిలో ఇంటర్మీడియట్ పూర్తయిన తరువాత ప్రసాదరెడ్డి ఒంగోలు మంగమ్మ కాలేజిలో బికాం డిగ్రీ లో చేరారు. అప్పుడే అప్పటి యూత్ కాంగ్రెస్ నాయకులు, ప్రస్తుత మాజీమంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం యూత్ కాంగ్రెస్ రాజకీయాల్లో కొనసాగేందుకు దారి తీసింది. దీంతో బన్నీ 1988- 1991 లో ఎన్ఎస్ యుఐ రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. అప్పటి నుంచి బాలినేని శ్రీనివాస రెడ్డితో అనుబంధం కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

వివాహం తర్వాత పెరిగిన రాజకీయ అనుబంధం



కనిగిరికి చెందిన తమ సమీప బంధువు సరితను ప్రసాదరెడ్డి వివాహం చేసుకున్నాడు. ఆ తరువాత రాజకీయ అనుబంధం మరింత బలపడిందని చెప్పాలి. సరిత తాతయ్య కోటపాటి గురుస్వామి రెడ్డి కూడా ఎమ్మెల్యేగా వ్యవ హరించారు. గురుస్వామిరెడ్డి కనిగిరితో పాటు నెల్లూరు జిల్లా ఉదయగిరి ఎమ్మెల్యే (1967- 1972) కొనసాగారు. వారి సాన్నిహిత్యంతో రాజకీయాల పట్ల మరింత ఆసక్తి పెరిగింది. దీంతో ప్రసాదరెడ్డి నియోజకవర్గ స్థాయిలో కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహించారు. ఈయన సతీమణి సరిత ప్రస్తుతం కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు

జడ్ పిటిసి గా...

2001 స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరపున జడ్ పిటిసిగా పోటీ చేసి గెలుపొందారు. ఈ ఎన్నికల్లో కందుకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ తరపున 21 మండలాల్లో 21మంది పోటీ చేస్తే ఈయన ఒక్కరు మాత్రమే గెలుపొందడం విశేషం. ఈయన జడ్ పిటిసిగా 2006 వరకు కొనసాగారు.

వైసిపి తో ప్రయాణం

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖర రెడ్డి మరణానంతరం ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన ఓదార్పు యాత్రలో ప్రసాదరెడ్డి చురుగ్గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కనిగిరి ప్రాంతంలో నిర్వహించిన పలు సభలను జయప్రదం చేయడంలో కీలక భూమిక పోషించారు. అప్పటి నుంచి బన్నీ వైసిపి లో క్రియాశీల పాత్ర పోషిస్తున్నారు. 2014 ఎన్నికలలో చురుగ్గా పనిచేశారు. 2019 ఎన్నికలలో ప్రస్తుత ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ గెలుపుకు మంచి కృషి చేశారు.

ఎమ్మెల్యేగా గెలుపొందటం జీవితాశయం

మూడున్నర దశాబ్దాల రాజకీయ అనుభవం గడించిన తాను ఎమ్మెల్యేగా గెలుపొందటం జీవితాశయం అంటారు బన్నీ. రాజకీయ కుటుంబ నేపథ్యం కలిగిన తాను 2004లో కనిగిరి టికెట్ కోసం ప్రయత్నం చేసినట్లు గుర్తుచేశారు. 2009 ఎన్నికల్లో తన అభ్యర్థిత్వాన్ని రాజశేఖరరెడ్డి ప్రతిపాదించినా ఎఐసిసి తొలగించిందన్నారు. 2014 ,2019 లో వైసిపి టికెట్ కోసం ప్రయత్నం చేసినట్లు. అయితే కొన్ని ప్రత్యేక పరిస్థితుల కారణంగా బుర్రా మధుసూదన్ యాదవ్ అభ్యర్థిత్వాన్ని తానే బలపరచానన్నారు. 2024 ఎన్నికలలో కనిగిరి టికెట్ తనకే ఇస్తానని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మాట ఇచ్చారన్నారు.

సహకార బ్యాంకు అభివద్ధికి కృషి

ఇప్పటికే లాభాల్లో ఉన్న పిడిసిసి బ్యాంక్ పురోభివద్ధికి తన శక్తి వంచన లేకుండా కషి చేస్తానన్నారు. పాలకవర్గ సభ్యుల సహకారం, అధికారులు, సిబ్బంది తోడ్పాటుతో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రయత్నం చేస్తామన్నారు.

నమ్మకం వమ్ముచేయను..

తనపట్ల ఎంతో నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డికి, మంత్రి ఆదిమూలపు సురేష్, వైవి.సుబ్బారెడ్డి, విజయసాయి రెడ్డి, జంకె వెంకట రెడ్డి ,ఎమ్మెల్యేలకు కతజ్ఞతలు తెలుపుతున్నట్లు బన్నీ పేర్కొన్నారు.

ఘనంగా 'స్నేహ మధురిమలు' గ్రంథావిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

స్థానిక పెదపవని భళేరావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉదయం ఇనకొల్లు మస్తానయ్య విరచిత 'స్నేహమధురిమలు' గ్రంథావిష్కరణ సభ నిర్వహించారు. స్నేహితుల దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకొని పూర్వ విద్యార్థుల(1979-80 బ్యాచ్) ఆత్మీయ కలయికలో భాగంగా ఏర్పాటు చేసిన సభకు పాఠశాల పూర్వ విద్యార్థి, ఇఒ చిట్టాబత్తిన వీర రాఘవులు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, కళామిత్రమండలి(తెలుగు లోగిలి) సంస్థ జాతీయ అధ్యక్షులు డా.నూనె అంకమ్మరావు మాట్లాడారు. తర్వాత చెన్నంశెట్టి సుబ్బారావు, చావలి ప్రగతిదేవి, ముళ్ళపాటి మాల్యాద్రి లక్ష్మీనరసింహం చేతులమీదుగా "స్నేహమధురిమల"గ్రంథాన్ని ఆవిష్కరించారు. తదుపరి విద్యార్థులు అందరూ గురువులను ఘనంగా సత్కరించారు.


స్నేహ మధురిమలు గ్రంథావిష్కరణ చేస్తున్న దృశ్యం



సంఘీభావ ర్యాలీ చేస్తున్న సిఐటియు నాయకులు

సిఐటియు సంఘీభావ ర్యాలీ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

యునైటెడ్ ఎలక్ట్రిసిటి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ పోరాటం జయప్రదానికి సిఐటియు ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ ఆదివారం నిర్వహించారు. స్థానిక సిఐటియు కార్యాలయం నుంచి సాగర్ సెంటర్ వరకు సంఘీభావ ర్యాలీని చేపట్టి అక్కడ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు అధ్యక్ష వహించారు ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ మాట్లాడి పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి నాలుగున్నర సంవత్సరాల దాటిన విద్యుత్ కార్మికులకి ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు సమాన పనికి సమాన వేతనం, కాంటాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, తెలంగాణ తరహాలో వేతనాలు ఇవ్వాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే విద్యుత్ కార్మికులు పోరాటానికి సమ్మెకి సిద్ధమవుతున్న సందర్భంగా సిఐటియు ప్రకాశం జిల్లా కమిటీ పోరాటాన్ని సమ్మెను బలపరచాలని నిర్ణయించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఆఫీస్ బ్యారెట్స్ జిల్లా కమిటీ సభ్యులు, కౌన్సిల్ మెంబర్, శ్రామిక మహిళలు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జెవివి ఆధ్వర్యంలో స్థానిక గౌతమి జూనియర్ కళాశాలలో పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అంశంపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జెవివి డివిజన్ కార్యదర్శి ఏనుగుల రవికుమార్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు తగ్గి వర్షాలు సక్రమంగా కురిసేందుకు విరివిగా మొక్కలను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌతమి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గుంటక త్రిపురారెడ్డి, దుగ్గెంపూడి బ్రహ్మారెడ్డి, ఎం.భాస్కర్ రెడ్డి, మునగ సురేష్, ఉన్నం సురేంద్ర, పాల్గొన్నారు.

న్యాయవ్యవస్థ ప్రతిష్టను కాపాడుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

కోర్టు ప్రాంగణంలో శంకుస్థాపన చేశారు. ఆ తరువాత ఆరో అదనపు జిల్లా జడ్జి నివాస బంగ్లాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో హైకోర్టు న్యాయమూర్తి మన్మథరావు మాట్లాడారు. మార్కాపురంలో నాలుగు కోర్టుల్లో జడ్జిల కొరత ఉందన్నారు. ఇన్‌ఛార్జిలతో నిర్వహణ జరుగుతోందన్నారు. జడ్జిల నియామకం కోసం చర్యలు తీసుకుంటామని చెప్పారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు అంకితభావంతో న్యాయ వ్యవస్థను నడిపించాలన్నారు. కోర్టు ప్రాంగణంతో పాటు బహిరంగ ప్రదేశాల్లోనూ నెలకోసారి సమిష్టిగా శ్రమదానం చేసేందుకు అలవాటు పడాలని సూచించారు. సాంకేతికతతో న్యాయ వ్యవస్థలో మార్పులు వస్తున్నాయని, వాటికి అనుగుణంగా మనం కూడా మార్పు చెందాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. ఈ సభలో హైకోర్టు న్యాయమూర్తులు జి.రామకృష్ణప్రసాద్, ఎవి రవీంద్రబాబు, జిల్లా జడ్జి ఇ.భారతి, మార్కాపురంలోని ఆరవ అదనపు జిల్లా జడ్జి టి.రాజా వెంకటాద్రి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ కరిముల్లా, మార్కాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.శ్రీనివాస్ ప్రసంగించారు. ఈ సందర్భంగా అతిథులను మార్కాపురం బార్ అసోసియేషన్ ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, మార్కాపురం డిఎస్పీ జీ.వీరరాఘవరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - చీరాల

మహిళా మండలిలోని వృద్ధులకు కారంచేడుకు చెందిన నువ్వల శ్రీకాంత్ పుట్టఇన రోజు సందర్భంగా ఆదివారం అన్నదానం చేశారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని నువ్వల శ్రీకాంత్ అన్నారు. ఆకలితో ఉన్నవారికి కడుపునింపాలని అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో తన వంతుగా సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. దాతల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



చంద్రబాబు దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న పోతుల సునీత

చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి - చీరాల

పుంగనూరులో చంద్రబాబు రెచ్చగొట్టే ధోరణిలో మాట్లాడటం వలనే పోలీసులు, వైసీపీ నేతలపై రాళ్ల దాడులు జరిగాయని ఎమ్మెల్సీ, వైసీపీ రాష్ట్ర మహిళాధ్యక్షురాలు పోతుల సునీత అన్నారు. స్థానిక గడియార స్తంభం సెంటర్లో చంద్రబాబు దిష్టిబొమ్మను ఆమె ఆదివారం దహనం చేశారు. దాడి గురించి జనసేన నేత పవన్ కళ్యాణ్ ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. భవిష్యత్తులో ప్రజలను రెచ్చగొట్టే పనులు చేస్తే ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లెల బుల్లిబాబు, దాసరి రూప, దాసి పీటర్ రమేష్, గుమ్మడి రత్నప్రకాష్ పాల్గొన్నారు.



కొండయ్య ఆధ్వర్యంలో తరలి వెళ్లిన టిడిపి కార్యకర్తలు

తరలిన టిడిపి నేతలు

ప్రజాశక్తి - చీరాల

వైసీపీ పాలనలో సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై టిడిపి అధినేత చంద్రబాబు చేపట్టిన యువద్దబేరి ఆదివారం ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం మల్లవరం గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు సంఘీభావంగా చీరాల నుంచి పెద్దసంఖ్యలో టిడిపి కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో టిడిపి చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎంఎం కొండయ్య, బాపట్ల పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షులు కౌతరపు జనార్ధనరావు, పట్టణ, మండల అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు, గంజి పురుషోత్తం, అడ్డగడ రామయ్య, కంకణాల శ్యాం, అవ్వారు సాంబయ్య, తేలప్రోలు నాగేశ్వరరావు, శివ నాగమల్లేశ్వరి, లావేటి శ్రీనివాసతేజ, యర్రాకుల ప్రసాద్ ఉన్నారు.



పట్టుబడ్డ రేషన్ బియ్యం చూపుతున్న డిటి ఓంకార్

90 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - చీరాల

పేదల రేషన్ బియ్యాన్ని అక్రమార్కులు ఊర్లు దాటిస్తున్నారు. ఆదివారం రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు వేటపాలెం కొత్తపేటలోని ఐఎల్‌టిడి కాలనీ పాత ఎక్సైజ్ పోలీసు స్టేషన్ సమీపంలోని ఆటో డ్రైవర్ ముకిరి మోహనరావు అలియాస్ (ఇశ్రాయేలు) ఇంటిలో 90బస్తాల రేషన్ బియ్యాన్ని నిల్వచేశారు. ఈ ముఠాపై ఎన్ఫోర్స్మెంట్ డిటి ఓంకార్ తన సిబ్బందితో మెరుపు దాడి చేశారు. రాత్రికి రాత్రి వాటిని ఊరు దాటిస్తున్నట్లు సమాచారం అందుకున్న అధికారులు ఇంటిలో సోదాలు చేశారు. ఇంటి యజమాని పై 6ఎ కేసు, క్రిమినల్ కేసులు పెట్టనున్నట్లు ఎన్ఫోర్స్మెంట్ డీటీ ఓంకార్ తెలిపారు. ఆయన వెంట భాషా, గీతా రాణి, అబ్రాహాం ఉన్నారు.

ఆధునిక హంగులతో రేపల్లె రైల్వే స్టేషన్

- రూ.25.6కోట్లతో రైల్వే స్టేషన్ ఆధునీకరణ
- వర్చువల్ పద్ధతిలో ప్రధాని మోదీ శంకుస్థాపన
- శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి నాగార్జున

పజాశక్తి - రేపల్లె

అమృతభారత్ పథకంలో భాగంగా రేపల్లె రైల్వే స్టేషన్ రూ.25.6కోట్లతో ఆధునీకరణ పనులను ప్రధాని మోడీ వర్చువల్ పద్ధతిలో ఆదివారం పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడారు. స్టేషన్ ఆధునీకరణ, అభివృద్ధి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టటం అభినందనీయమని అన్నారు. ఈ పథకం ద్వారా గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని రేపల్లె, పిడుగురాళ్ల, దొనకొండ స్టేషన్ల రూపురేఖలు మారనున్నట్లు తెలిపారు. ప్రపంచ స్థాయి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని అన్నారు. భట్టిప్రోలు, వేమూరు స్టేషన్ల మధ్య ట్రక్‌ను పరిశీలించి ఆ స్టేషన్లను అభివృద్ధి చేయాలని కోరారు. రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణరావు మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన రేపల్లెకు అంతర్జాతీయ స్థాయిలో ఎగుమతులు చేసే వీలుందని అన్నారు. ఆక్వా, మెరైన్ ఉత్పత్తులలో కాకినాడ, విశాఖపట్నం తరువాత నిజాంపట్నంకు ఉందని అన్నారు. వాణిజ్య పంటలైన పసుపు, అరటి, కంద ఉత్పత్తులు ఇతర రాష్ట్రాలకు ఇక్కడ నుండి ఎగుమతి అవుతాయని అన్నారు. 1916లో చిన్న స్టేషన్‌గా బ్రిటీష్ వారు ప్రారంభించిన రేపల్లె రైల్వే స్టేషన్ అంచలంచలుగా అభివృద్ధి చెందిందన్నారు. వాణిజ్య ఎగుమతులకు వీలుగా 2011లో మచిలీపట్నం, రేపల్లె, నిజాంపట్నం మీదుగా బాపట్ల వరకు నూతన రైల్వే లైన్ నిర్మాణానికి సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఒంగోలు నుండి కత్తిపూడి వరకు నిర్మించిన 216ఏ జాతీయ రహదారి వలన మద్రాస్ నుండి కలకత్తా రవాణా చాలా అనుకూలంగా ఉందన్నారు. మచిలీపట్నం - బాపట్ల నూతన రైలు మార్గం నిర్మిస్తే మరింత వేగంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ రైలు మార్గం కోసం కేంద్ర రైల్వే శాఖకు నివేదిక ఇస్తామని చెప్పారు. అనంతరం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని మంత్రి మేరుగ నాగార్జున ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లిఖార్జునరావు, గుంటూరు అడిషనల్ రైల్వే మేనేజర్ సైమన్, చైర్ పర్సన్ కట్టా మంగ, బిజెపి జిల్లా అధ్యక్షులు రామారావు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున

ఉపకరణాలు అందజేత

ప్రజాశక్తి - రేపల్లె

దివ్యాంగుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా తన స్వగృహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో దివ్యాం గులకు ఉపకరణాలు అందజేశారు. నియోజకవర్గ అభివృద్ధిలో రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు కృషి ఎనలేనిదని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య అన్నారు. వచ్చే ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలుపు తథ్యమని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు మోపిదేవి రాజీవ్, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల జిల్లా కార్యదర్శి శీలం సోమయ్య(భరత్), బాలకృష్ణ పాల్గొన్నారు.



ఉపకరణాలు అందజేస్తున్న మోపిదేవి

శాస్త్రీయ సమాజాన్ని నిర్మించాలి : డాక్టర్ సుబ్బారావు

జెవివి 17వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపు

ప్రజాశక్తి - చీరాల

సైన్సును ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి శాస్త్రీయ సమాజాన్ని నిర్మించాలని డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు, ఎఐపిఎస్ఎస్ నాయకులు కె శ్రీనివాసరావు అన్నారు. స్థానిక కెజిఎం బాలికోన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన జెవివి రాష్ట్ర 17వ మహాసభల ఆహ్వాన సంఘ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి జెవివి జిల్లా అధ్యక్షులు భాస్కరరావు అధ్యక్షత వహించారు. సెప్టెంబర్ 9, 10తేదీల్లో చీరాలలో జరుగు జెవివి రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు కుర్రా రామారావు, భాస్కరరావు, వీరాంజనేయులు, బాబూరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సుబ్బారావు

సెప్టెంబర్‌లో చేనేతల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - చీరాల

ఆల్ ఇండియా వివర్స్ ఫెడరేషన్ కేంద్ర రాష్ట్ర కమిటీలకు చెందిన నాయకుల సమావేశం బాపట్ల జిల్లా వీవర్స్ ఫెడరేషన్ల ఆధ్వర్యంలో చీరాలలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బండారు ఆనంద ప్రసాద్ మాట్లాడుతూ చీరాలలో అత్యధికులు చేనేత సామాజకులు ఉన్నందున సెప్టెంబర్ 10న చీరాలలో చేనేత సమావేశం జరుపనున్నట్లు తెలిపారు. వృత్తి పరిరక్షణ, కార్మికుల సంక్షేమం కోసం 18చేనేత కులాల ఐక్యత, చేనేత సామాజిక ప్రయోజనాల కోసం సమావేశం జరుగు తుందన్నారు. సమావేశంలో శివరాం ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండ్ల బాబు, పిల్లలమర్రి నాగేశ్వరరావు, గుంటి శ్రీనివాసరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిలు మేడ వెంకట్రావు, గౌరాబత్తిని రవిబాబు, కెవి శేషయ్య, బాపట్ల జిల్లా వీవర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు పృద్వి ఆదిశేషు, దేవాంగ్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి యారాసు అరుణ్ బాబు, గుత్తి సుబ్బానాగులు వైస్ ప్రెసిడెంట్, సహాయ కార్యదర్శి వోలుకుల మోహన్రావు, జాయింట్ సెక్రెటరీ కర్ణ పోలయ్య పాల్గొన్నారు.

మహిళల పొదుపు సొమ్ముతో జగనన్న మహిళా మార్ట్‌లు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

రాష్ట్ర ప్రభుత్వం మహిళలను వ్యాపారవేత్తలుగా చేస్తామని ప్రకటించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళల భాగస్వామ్యంతో మహిళా మార్ట్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. మహిళలు పొదుపు చేసుకున్న సొమ్ముతోనే జగనన్న మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. పొదుపు సంఘాలలోని ప్రతిఒక్క మహిళ తమ వాటాగా రూ.150 లేదా రూ.300 చెల్లించాలని అధికారులు చెప్పారు. ఇలా లక్షల రూపాయలు మహిళల నుంచి రాబట్టారు. పొదుపు మహిళలు చెల్లించిన సొమ్ముతో వ్యాపారం చేసి వాటిపై వచ్చే లాభాలను వారికి పంచాల్సి ఉంది. అయితే లాభాలు పంచుతారా లేక ఏడాది తరువాత వారి వాటా ధనం వారికి చెల్లిస్తారా అన్నదానిపై స్పష్టత లేదు. కొద్ది రోజుల క్రితం చీరాల మండలం ఈపురుపాలెంలో మహిళా మార్ట్‌ను ప్రారంభించారు. ఇందుకోసం పొదుపు సంఘాల మహిళలు ఒక్కోక్కరు రూ.300 చొప్పున రూ.46లక్షలు మహిళా మార్ట్ కోసం తమ వాటాగా చెల్లించారు. ఈ సొమ్ముతోనే కంప్యూటర్లు, ర్యాక్‌లు ఇతర సామాగ్రి కొన్నారు. రూ.30లక్షలతో సరుకులు కొనుగోలు చేశారు. మార్ట్ నిర్వహణ కోసం నాలుగు రకాల కమిటీలు వేశారు. వీరికి తగిన శిక్షణ ఇచ్చినట్లు చెబుతున్నారు. మార్ట్‌ను సక్రమంగా నిర్వహించి లాభాలు సాధించేలా ఈ కమిటీలు కృషి చేయాల్సి ఉంది. సరుకుల కొనుగోళ్ళు, జీతాలు, ఇతర ఖర్చులు పోగా మిగిలిన మొత్తాన్ని లాభంగా సభ్యులకు పంచాల్సి ఉంది.



ఈపూరుపాలెంలో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్

అయితే గతంలో మెప్మా, డిఆర్‌డిఎ తరపున పొదుపు మహిళల భాగస్వామ్యంతో చాలాచోట్ల డ్వాక్రా బజార్లు, అల్పాహార శాలలు, జన ఔషిది కేంద్రాలు ఏర్పాటు చేశారు. కాలక్రమంలో అవన్నీ నష్టాతో మూతపడ్డాయి. ఇప్పుడు వైసిపి ప్రభుత్వం జగనన్న మహిళా మార్ట్‌లను ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు ఇవ్వకుండా పూర్తిగా మహిళల సొమ్ముతోనే మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఏడాది క్రితం అద్దంకిలో మహిళా మార్ట్ ఏర్పాటు చేశారు. కాని నిర్వహణలో అవకతవకలు జరిగిరి లాభాలు రాకపోగా అంతంత మాత్రంగా ఉంటుందనే ఆరోపణలున్నాయి. బయట షాపుల కన్నా ఇక్కడ ధరలు ఎక్కువగా ఉంటున్నాయని ప్రచారం. దీంతో కొనుగోళ్ళు తగ్గి నష్టాలు వస్తున్నట్లు వెల్లడవుతుంది. ఎక్కడయినా వ్యాపారంలో అనుభవం ఉన్న మహిళలు కమిటీగా ఉండి మహిళా మార్ట్‌లు నడిపితే అవి లాభాల బాటలో ఉంటాయి. కాని అధికారులు, ప్రజాప్రతినిధుల సిఫార్సులతో కమిటీలను నియమి వాటి మనుగడ అంతంత మాత్రంగా ఉంటుంది.

మెప్మాలో మహిళా మార్ట్ కోసం రూ.18లక్షలు వసూలు : చీరాల పురపాలక సంఘంలో మెప్మా ద్వారా మహిళా మార్ట్ ఏర్పాటు కోసం 6నెలల క్రితమే మహిళల నుంచి రూ.150 చొప్పున వసూళ్ళు చేశారు. పట్టణంలో 1500 పొదుపు సంఘాల నుంచి రూ.22లక్షల వరకు వసూలు చేయాలని నిర్ణయించి రూ.18లక్షలు వసూళ్ళు జరిగినట్లు తెలుస్తుంది. వీటికి తోడు కొంత మ్యాచింగ్ గ్రాంట్ లేదా బ్యాంక్ రుణం తీసుకుని మార్ట్ ఏర్పాటు చేయాల్సిఉంది. చర్చి రోడ్డులో ఉన్న పాత మీ సేవాకేంద్ర భవనంలో మహిళా మార్ట్ కోసం ఆ భవనం మరమ్మత్తులకు రూ.5లక్షల మున్సిపల్ నిధులు మంజూరు చేశారు. కాని మార్ట్ నిర్వహణ కోసం 11మందితో కమిటీ వేయాల్సి ఉండగా నెలలు గడుస్తున్నా వేయలేదు. చీరాల మెప్మాలో గత కాలంగా ఆర్థిక అవకతవకల ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవ తీసుకుని మహిళా మార్ట్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేసిన దాఖలాలు లేవు. అసలు చీరాల పట్టణంలో మహిళా మార్ట్ ఏర్పాటు చేస్తారా లేదా అన్న సందేహాలు ఉన్నాయి. ఇప్పటికే పొదుపు సంఘాల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసి ఉన్న నేపథ్యంలో ఈ మొత్తం దారి మళ్ళుతుందన్న అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయకుంటే

ఆందోళనలు ఉధృతం

- నేడు కలెక్టరేట్ల ముట్టడిని జయప్రదం చేయాలి
- ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఉమా మహేశ్వరరావు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఉమా మహేశ్వరరావు డిమాండ్ చేశారు. సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్, క్యాబ్, కార్మికులు, రెగ్యులర్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం ఇస్తామని చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్లు పూర్తి అయినా పట్టించుకోక పోవడాన్ని తప్పుపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే 10,117 మంది కార్మికులను రెగ్యులర్ చేస్తున్నట్లు రెండు నెలల కిందట రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు.



మాట్లాడుతున్న ఉమా మహేశ్వరరావు

ఈ ప్రకటన చూసిన మున్సిపల్ కార్మికులు తీవ్ర నిరాశకు గురయ్యారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో లక్షలాది మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు ఏళ్ల తరబడి పనిచేస్తుంటే అందులో కేవలం 10,117మందిని రెగ్యులర్ చేస్తున్నామని చెప్పడం దుర్మార్గమన్నారు. మున్సిపల్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చి ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేసినందున ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు ఏవి కూడా వారికి అందడం లేదన్నారు. ఆప్కాస్‌లో ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేసినందున ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే సౌకర్యాలు అన్నీ మున్సిపల్ కార్మికులకు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈనెల 17న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతామని, అవసరమైతే ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం నేడు మున్సిపల్ కార్మికులు చేపట్టిన ఛలో కలక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి తమ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి పనిచేసే మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహారించడాన్ని ఆయన తప్పుపట్టారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోవిడ్ కార్మికులకు నెలకు రూ.15వేలు వేతనం ఇవ్వాలని, చనిపోయిన కార్మికులు, అనారోగ్యంతో బాధపడుతన్న కార్మికుల బదులు వారి కుటుంబ సభ్యులను పనిలోకి తీసుకోవాలన్నారు. ఈసమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.సుబ్బారాయుడు, నాయకులు శ్రీరామ శ్రీనివాసరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుకను దోచుకునేందుకు


ప్రాజెక్టును గాలికొదిలేశారు

- 'వెలిగొండ'ను పూర్తి చేసేది నేనే
- ప్రభుత్వంపై నమ్మకం లేక పనుల నిరాకరణ
- నదుల అనుసంధానం ద్వారా సాగు నీరు ఇవ్వొచ్చు
- మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి-మద్దిపాడు

ఇసుకను దోచుకునేందుకే గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేయలేదని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధ్వజమెత్తారు. వైసిపి ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని మల్లవరం గుండ్లకమ్మ ప్రాజెక్టును ఆదివారం సందర్శించారు. తొలుత సాగునీటి రంగంపై వివిధ వర్గాల వారితో ఇష్టాగోష్టి నిర్వహించి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ సాగునీటి రంగానికి జగన్ ప్రభుత్వం చేసిన అన్యాయం, నిర్లక్ష్యంపై ప్రశ్నించి, వాస్తవాలు వివరించేందుకు ప్రాజెక్టుల సందర్శన కార్యక్రమం చేపట్టానన్నారు. ఏ రాష్ట్రానికి లేని సాగునీటి వనరుల లభ్యత మన రాష్ట్రానికి ఉందని, వీటిని సక్రమంగా వినియోగించుకుంటే మంచి ఫలితాలు వస్తాయన్నారు. నదుల అనుసంధానం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సాగు నీరు ఇవ్వొచ్చన్నారు. పట్టిసీమ ద్వారా గోదావరి నీరు కష్టాడెల్టాకు ఇచ్చి డెల్టాకు రావాల్సిన నీటిని పొదుపు చేసి శ్రీశైలం నుంచి రాయల సీమకు నీరు ఇచ్చామన్నారు. పట్టిసీమ ద్వారా 120 టిఎంసిల నీరు, వైకుంఠపురం ద్వారా 130 టిఎంసిల నీటిని పొదుపు చేసి... ఆ 250 టిఎంసిల నీటిని రాయల సీమకు ఇవ్వొచ్చని, గోదావరి నీటిని పెన్నాకు తీసుకొచ్చేందుకు ప్రతిపాదించిన పనుల్లో మొదటి ఫేజ్ పనులకు శంకుస్థాపన చేశామని, అదే వైకుంఠపురం ప్రాజెక్టు అని చెప్పారు. ప్రస్తుతం కష్ణా నది ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేదని, గోదావరి నీరు వైకుంఠపురానికి, తరువాత నాగార్జున సాగర్ రైట్ కెనాల్ కు తీసుకువచ్చి ఉంటే నీరు అందుబాటులో ఉండేదని పేర్కొన్నారు. గోదావరి నీటిని బనకచర్లకు తీసుకు రాగలిగితే. వెలిగొండ ప్రాజెక్టుకు కూడా నీరు వస్తాయన్నారు. రాష్ట్రంలో ఇరిగేషన్ కోసం 2014 నుంచి 2019 వరకూ రూ.68.293 కోట్లు ఖర్చు పెట్టామన్నారు. వైసీపీ కేవలం రూ.22.165 వేల కోట్లు ఖర్చు పెట్టినట్లు తెలిపారు. ప్రకాశం జిల్లాలో 16 లక్షల సాగుభూమి ఉంటే....10 లక్షల ఎకరాలకే సాగునీటి లభ్యత ఉందన్నారు. ఎన్ఎస్‌పి జవహర్ లాల్ కెనాల్ కు ఆనాడు ఆధునీకరణ పనులు చేశామన్నారు. తాను ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశానన్నారు. టీడీపీ హయాంలో రూ.1414 కోట్లు ఖర్చు పెడితే....వైసిపి రూ. 953 కోట్లు ఖర్చు చేసిందన్నారు. భూసేకరణకు రూ. 1300 కోట్లు ఇస్తామని చెప్పి ఆ మొత్తం కూడా ఈ ప్రభుత్వం విడుదల చేయలేదన్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్‌కు టిడిపి హయాంలో రూ.81 కోట్లు ఖర్చుపెట్టామని, వైసిపి మొత్తం రూ.22 కోట్లు మాత్రమే ఖర్చుపెట్టిందన్నారు. వైసిపి ప్రభుత్వ నిర్వాకం వల్ల గుండ్లకమ్మ గేట్లు కూడా కొట్టుకు పోయాయన్నారు. కనీసం రూ. కోటి రూపాయల ఖర్చు అయ్యే గేటు పనులు కూడా పూర్తి చేయలేదన్నారు. కాంట్రాక్టర్ కు డబ్బులు ఇవ్వకపోవడంతో వారు పనులకు నిరాకరించా రన్నారు. గుంటూరు ఛానల్ పర్చూరు వరకూ పొడిగించాలి అని డిమాండ్ ఉందని, టిడిపి హయాంలో దీని కోసం రూ.274 కోట్లు మంజూరు చేశామన్నారు. ఆ పనులను అటకెక్కించారన్నారు. కొరిశపాడు ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేకపోయిందన్నారు. రాళ్లపాడు ప్రాజెక్టుకు టిడిపి హయాంలో రూ.27 కోట్లు ఖర్చు పెట్టామని, సోమశిల నుంచి 1.5 టిఎంసిల నీరు ఇచ్చామన్నారు. ప్రస్తుతం కాలువల పూడికలు కూడా తీయడం లేదన్నారు. మోపాడు ప్రాజెక్టు మరమ్మతులకు నిధులు ఇవ్వలేదన్నారు. కంభం చెరువు ఆధునీకరణ పనులు వైసిపి ప్రభుత్వం అటకెక్కించిందన్నారు. పోలవరానికి జగన్ చేసిన నష్టాన్ని అక్కడికి వెళ్లి వివరిస్తానన్నారు. 10 ఏళ్లు పాటు టీడీపీ వరుసగా అధికారంలో ఉండి ఉంటే ఈ ప్రాజెక్టులు అన్నీ పూర్తి అయ్యేవని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, ఏలూరి సాంబశివరావు, మాజీలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, బిఎన్‌జవిజయ్‌కుమార్, మాజీ మంత్రి ఉమామహేశ్వరరావు, టిడిపి జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


గుండ్లకమ్మ ప్రాజెక్టును సందర్శిస్తున్న చంద్రబాబు నాయకుడు



ప్రాజెక్టు గురించి ప్రజంటేషన్ ఇస్తున్న చంద్రబాబు


దెబ్బతిన్న గేట్లను పరిశీలిస్తున్న చంద్రబాబు నాయకుడు


ప్రజలు అభివాదం చేస్తున్న చంద్రబాబు నాయుడు

చంద్రబాబుకు ఘన స్వాగతం

ప్రజాశక్తి-టంగుటూరు

టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు తెలుగు తమ్ముళ్ల ఘన స్వాగతం పలికారు. సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి, ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా గుండ్లకమ్మ ప్రాజెక్టును సందర్శించేందుకు రోడ్డు మార్గంలో చంద్రబాబు వెళ్లారు. టంగుటూరు టోల్ ప్లాజా వద్ద కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు టోల్ ప్లాజా వద్దకు భారీ సంఖ్యలో చేరుకున్నారు. కార్యకర్తల ఉత్సాహం చూసిన నారా చంద్రబాబు నాయుడు కాన్వాయ్ దిగి అభివాదం చేశారు. ఈ కార్యక్రమంలో తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య, తెలుగు రైతు కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, టిడిపి టంగుటూరు పట్టణ అధ్యక్షుడు కామని నాగశ్రీను, మాజీ ఎంపిపి చదలవాడ చంద్రశేఖర్, రామా గోపి, డాలు వెంకట్రావు, షేక్ బ్రహ్మయ్య పాల్గొన్నారు.



పుస్తకాలు అందజేస్తున్న అన్నపూర్ణ

రైతులకు అవగాహన

ప్రజాశక్తి- నాగులుప్పలపాడు

రైతులు పంటల సాగులో మేలైన యాజమాన్య, సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించవచ్చునని ఆత్మ పీడీ, జిల్లా వనరుల కేంద్రం సమన్వకర్త కె. అన్నపూర్ణ తెలిపారు. నాగులుప్పలపాడు మండలం ఈదుమూడి రైతు భరోసా కేంద్రం పరిధిలోని రైతులకు ఖరీఫ్ సీజన్ పంటల సాగుపై రైతులకు శనివారం శిక్షణా తరగుతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ విత్తనశుద్ధి, వేపనూనె, వేపగింజల కషాయం తయారీ, వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా వనరుల కేంద్రం ఎఒ వీరగంధం వెంకట శేషమ్మ పంటలకు ఆశించే తెగుళ్లు, పురుగుల వాటి నివారణ గురించి వివరించారు. అనంతరం పంటల సాగుకు సబంధించిన సాంకేతిక సమాచారాన్ని పుస్తక రూపంలో రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎఒ వెంకటరావు, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ త్రినాథ్‌రెడ్డి, జిల్లా వనరుల కేంద్రం ఎఒ ఎ. శైలజా రాణి, గ్రామ సర్పంచి చలపతిరావు, ఎంఎఎబి చైర్‌పర్సన్ లోక్‌నాథ్‌రెడ్డి, కనపర్తి, ఈదుమూడి గ్రామాల విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

విఠలాపురంలో అన్నదానం


ప్రజాశక్తి-దర్శి

తాళ్ళూరు మండలం విఠలాపురం గ్రామంలో మారంవారి కులదైవమైన అంకమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం అన్నదానం చేశారు. వైసిపి అద్దంకి నియోజకవర్గ పరిశీలకులు మాజీ ఎఎంసి చైర్మన్ మారం వెంకటరెడ్డి అన్నదాన్నా ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరు జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు, విఠలాపురం సర్పంచి మారం ఇంద్రసేనారెడ్డి,మారం అంజిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

శాస్త్రీయ సమాజ నిర్మాణమే లక్ష్యం : జెవివి

ప్రజాశక్తి -గిద్దలూరు రూరల్

శాస్త్రీయ సమాజ నిర్మాణమే జన విజ్ఞాన వేదిక లక్ష్యమని జెవివి సీనియర్ నాయకులు, డాక్టర్ భూమా బాల నరసింహారెడ్డి తెలిపారు. జెవివి గిద్దలూరు డివిజన్ 17వ మహాసభలు ఆదివారం నిర్వహించారు. మహాసభ ప్రారంభ సూచికగా జాతీయ పతాకం, జెవివి పతకాలను నాయకులు ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ బాలనరసింహారెడ్డి మాట్లాడుతూ శాస్త్రీయ సమాజ నిర్మాణం లక్ష్యంగా ఏర్పడిన జన విజ్ఞాన వేదిక గత 35 సంవత్సరాలుగా మూఢనమ్మకాల నిరోధకానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, బాలికల విద్య, ఆరోగ్యం, సామాజిక న్యాయం లాంటి అంశాలపై హేతుబద్ధమైన శాస్త్రీయ దక్పథాన్ని సమాజంలో వ్యాప్తి చేసేందుకు కషి చేస్తున్నట్లు తెలిపారు. జెవివి రాష్ట్ర నాయకులు పి.స్వరూప రెడ్డి మాట్లాడుతూ సమాజంలో తర్కించే తత్వాన్ని, పరిశీలించే గుణాన్ని, ఆలోచించే శక్తిని పెంపొందించడమే జన విజ్ఞాన వేదిక లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా జెవివి అనేక తీర్మానాలను ఆమోదించింది. అనంతరం ఆరు మండలాల కమిటీ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎపిటిసిఎ మాజీ అధ్యక్షుడు కె.రామిరెడ్డి, జెవివి నాయకులు డిజి.బ్రహ్మానంద రెడ్డి, కొండేటి రాజా, ఆర్.రంగరాజు, వి.వెంకటేశ్వర్లు, ఎ. విశ్వరూపం, ఎం.శ్రీనువాసులు, రమణారెడ్డి, షేక్ మస్తాన్, నాగేంద్రుడు, ప్రజానాట్య మండలి నాయకుడు కె.మహేష్, యుటిఎఫ్ నాయకులు ఎస్.జయ చంద్రారెడ్డి, వి. శ్రీని వాసులు, ఎ.అల్లూరయ్య, బి.ఈశ్వర్ కుమార్, వెంకటరామిరెడ్డి, మల్లికార్జున, జెవివి యూత్ కన్వీనర్ జావీద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



జాతీయ జెండా, జెవివి జండాలను ఆవిష్కరిస్తున్న నాయకులు



మాట్లాడుతున్న ఖాజా హుస్సేన్

మహాసభలను జయప్రదం చేయాలి : జెవివి

పామూరు : కనిగిరిలో ఈనెల 12, 13 తేదీల్లో నిర్వహిస్తున్న జనవిజ్ఞాన వేదిక జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాజా హుస్సేన్ కోరారు. జెవివి మహాసభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా అధ్యక్షుడు ఖాజా హుస్సేన్ మాట్లాడుతూ పాఠ్యపుస్తకాల్లో డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించడం అశాస్త్రీయమన్నారు. రోజురోజుకీ పెరుగుతున్న అశాస్త్రీయ భావజాలాలు, మణిపూర్ ఘటనపై అక్కడి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ఆయన తప్పుపట్టారు. మహారాష్ట్ర, కేరళ మాదిరిగా ఆంధ్ర ప్రదేశ్‌లోనూ మూఢనమ్మకాల నిరోధక చట్టాన్ని తీసుకురావాలన్నారు. జెవివి యూత్ జిల్లా కన్వీనర్ జి.శ్రీనివాసులు మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం పనిచేస్తుందన్నారు. యువత అశాస్త్ర భావజాలాల వైపు మరలకుండా ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలని తెలియజేశారు. అనంతరం జెవివి మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షుడిగా డాక్టర్ టి. చెన్న కష్ణ, అధ్యక్షుడిగా షేక్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శిగా కాలే శంకర్, కార్యదర్శిగా దేవరాజు, ఉపాధ్యక్షులుగా ఉత్తరరావు, ఫయాజ్, ట్రెజరర్‌గా ఖాశింపిరా, సమతా కన్వీనర్‌గా బి. పరిమళాదేవి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

చీమకుర్తి : చీమకుర్తి మండలం బూదవాడ పంచాయతీ పరిధిలోని గిరిజన కాలనీలో రూ.16లక్షలతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాలు,గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ నిధులతో అభివృద్ధి పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు, వైసిపి మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, సర్పంచి జె.మరియమ్మ, ఎంపిటిసి చిన్నపురెడ్డి సుశీలమ్మ, పాపిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి, ధర్మారపు సత్యం, దుద్దుకూరి రమేష్, కోటేశ్వరరావు, శంకర్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్నదానం

చీమకుర్తి : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005-2006 విద్యాసంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఎస్‌కెఆర్ బధిరుల పాఠశాల అన్నదానం నిర్వహించారు. స్నేహితుల దినోత్సవాన్ని పుస్కరించుకొని విద్యార్థులకు పండ్లు,స్వీట్లు ఆదివారం పంపిణీ చేశారు.అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎస్. అంజిరెడ్డి, వార్డెన్ బి.వాసు, పూర్వ విద్యార్థిని తులసి పాల్గొన్నారు.

గర్భిణులకు రక్తదానం

చీమకుర్తి : ఆపరేషన్ నిమిత్తం ఇద్దరు గర్భిణులకు రక్తం అవసరమైంది. వారి బంధువులు ఆర్‌డిఎఫ్ అధ్యక్షుడు ఇస్తర్ల శంకర్‌ను సంప్రదించారు. దీంతో ఆర్‌డిఎఫ్ సభ్యులు వినోద్, వెంకటేష్, సొంగా ప్రకాష్,నరేంద్ర రక్తదానం చేశారు.

10వ వార్డులో చైర్మన్ పర్యటన

ప్రజాశక్తి-దర్శి

దర్శి నగర పంచాయతీలో 10వ వార్డులో నగర పంచాయతీ చైర్మన్ నారపశెట్టి పిచ్చయ్య ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నెమిలయ్య, కోటయ్య, నాయకులు పాల్గొన్నారు.

దొనకొండ రైల్వే స్టేషన్‌కు పూర్వ వైభవం

మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-దొనకొండ

కేంద్రప్రభుత్వం అమృత్ భారత్ పథకం ద్వారా దొనకొండ రైల్వేకు పూర్వ వైభవం తీసుకొస్తున్నట్లు రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. అమృత్ భారత్ పథకంలో ఎంపికైన దొనకొండ రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులకు ప్రధాని మోడీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి సురేష్, ఎమ్మెల్యే వేణుగోపాల్ పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో రైల్వే ఎడిఆర్ఎం శ్రీనివాస్ అమృత్‌భారత్ పథకం ఉద్దేశం, చేపట్టే అభివృద్ధి పనుల గూర్చి వివరించారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ అమృత్‌భారత్ పథకంలో భాగంగా రూ.18 కోట్లతో రైల్వే స్టేషన్‌ను సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉషామురళీ, సర్పంచి కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి, తహశీల్దారు సువర్ణ, రైల్వే, ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ కల్పించాలి : ఎంపిపి

దొనకొండ ప్రాంత ప్రజలకు రోడ్డు మార్గాన రవాణా సౌకర్యం లేదని, రైలు ప్రయాణమే దిక్కుఅని ఈ నేపథ్యంలో ఇక్కడ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం లేకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంపీపీ ఉషామురళీ తెలిపారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని కోరుతూ రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశారు.



మోడీ ప్రసంగాన్ని ఆన్‌లైన్‌లో వీక్షిస్తున్న మంత్రి , ఎమ్మెల్యే

శింగరాయకొండ : శింగరాయకొండ రైల్వే స్టేషన్‌ను రూ.25.13 కోట్లలో అభివృద్ధి చేస్తున్నారు. అందులో భాగంగా అభివృద్ధి పనులనకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆన్‌లైన్ ద్వారా ఆదివారం శంకుస్థాపన చేశారు. అమత్ భారత్ పథకం ద్వారా దేశవ్యాప్తంగా 508 రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేస్తున్నారు. అందులో శింగరాయకొండ రైల్వే స్టేషన్‌ను కూడా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్ అభివద్ధిపై సూచనలు సలహాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగాన్ని ఆన్‌లైన్‌లో తిలకించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, ఏలూరు శ్రీనివాసరావు, ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు కొత్తూరు విజయకుమార్, డిప్యూటీ తహశీల్దారు తన్నీరు వెంకటేశ్వర్లు, జిఆర్‌పి, సిఆర్‌పి పోలీసులు పాల్గొన్నారు.

శివకు డాక్టర్ మాదాసి పరామర్శ

ప్రజాశక్తి-శింగరాయకొండ

మండల పరిధిలోని కనుమళ్ల పంచాయతీ 10వ వార్డు మెంబర్ చొప్పర శివ ఇటీవల గాయపడ్డారు. వైద్య చికిత్స అనంతరం ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. అందులో భాగంగా వైసిపి కొండపి నియోజక వర్గ మాజీ సమన్వయకర్త, పిడిసిసి బ్యాంక్ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య చొప్పర శివను ఆదివారం పరామర్శించారు.ఈ కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం మండల అధ్యక్షులు శీలం రాము, మూలగుంటపాడు మాజీ సర్పంచి చుక్కా కిరణ్‌కుమార్, బీసీసెల్ మండల అధ్యక్షుడు కుంచాల రవి, నౌషద్ మంగరాజు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

19న సర్పంచి పదవికి ఎన్నిక

ప్రజాశక్తి- శింగరాయకొండ

రాష్ట్ర ఎన్నికల కమిషన్ పాకల సర్పంచి పదవి ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేసింది. 11న నామినేషన్లు స్వీకరిస్తారు. 19న ఎన్నికలు నిర్వహిం చారు. పాకల సర్పంచి కొక్కిలిగడ్డ రోశయ్య అనారోగ్యంతో మతి చెందాడు. 16వ వార్డు నెంబర్ షేక్ హాఫీదా బేగం అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో సర్పంచి, 16వ వార్డు మెంబరుకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని 10వ వార్డు మెంబర్ దేశం శెట్టి రమేష్‌బాబు నెల్లూరు జిల్లా కందుకూరు కోర్టులో ఉద్యోగం వచ్చింది. దీంతో ఆయన తన పదవికి రాజీనామా చేశారు. దీంతో అక్కడ కూడా ఎన్నికలు నిర్వహిస్తున్నారు.



ప్రతాపరెడ్డిని సన్మానిస్తున్న సత్యనారాయణరెడ్డి

మాదిరెడ్డికి 'చింతల' సన్మానం

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

హనుమంతునిపాడు మండలం హాజీపురం గ్రామానికి చెందిన ఐపిఎస్ ఆఫీసర్, డీజీ మాదిరెడ్డి ప్రతాపరెడ్డిని ఎపి రెడ్డి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి ఆదివారం ఘనంగా సన్మానించారు. కనిగిరి ప్రాంత పర్యటనకు వచ్చిన ప్రతాపరెడ్డిని చింతలచెరువు సత్యనారాయణరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు యువతకు ఉద్యోగ అవకాశాలు, విద్యపై అవగాహన పెంచడం తదితర అంశాలపై చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో నందనవనం ఎంపిటిసి నారాయణ స్వామి, హనుమంతపురం ఎంపిటిసి తిరుపతిరెడ్డి, చినఇర్లపాడు సర్పంచి ముద్దా బాబు, సీతారాంపురం సర్పంచి రవీంద్రరెడ్డి, ఉపాధ్యాయులు వెంకటరామిరెడ్డి, మూలే గోపాల్‌రెడ్డి, వద్దెంపుడి శివారెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎపిఎస్‌ఆర్‌టిసి నెల్లూరు రీజనల్ చైర్మన్ బత్తుల సుప్రజారెడ్డి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ బస్టాండ్‌కు సంబంధించి సర్వీస్‌లో ఉన్న కొని బస్సులు బస్టాండ్ లోనికి రావడం లేదు. బైపాస్ రోడ్డులో వెళ్తున్నాయి. దీంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ క్రమంలో శింగరాయకొండ అప్డేట్స్ సభ్యులు ఎపిఎస్ఆర్‌టిసి నెల్లూరు రీజనల్ చైర్మెన్ బత్తుల సుప్రజారెడ్డిని ఆదివారం కలిసి ప్రయాణికులు పడుతున్న ఇబ్బందుల గురించి ఆమె వివరించారు. శింగరాయకొండ బస్‌స్టేషన్ అధికారుల లెక్కల ప్రకారం బస్‌స్టేషన్‌కు100 పైగా సర్వీసులు రావాల్సిఉంది. ప్రస్తుతం 30 నుంచి 40 సర్వీసులు మాత్రమే బస్‌స్టేషన్‌లోకి వస్తున్నాయి. నెల్లూరు వెళ్లేందుకు మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4 వరకు బస్సులు రావట్లేదని, విజయవాడ వెళ్లే ప్రయాణికులు ఇదే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారులు తెలిపారు. రాత్రి సమయాల్లో ఒంగోలు నుంచి లేదా నెల్లూరు నుంచి శింగరాయకొండ చేరు కోవాలంటే ప్రయాణికులు బాధలు వర్ణనాతీతమని తెలిపారు. ఈ సమస్యల గురించి అప్డేట్స్ సభ్యులు లిఖిత పూర్వకంగా అర్జీ రూపంలో సుప్రజారెడ్డికి వివరించారు. శింగరాయకొండ బస్‌స్టేషన్‌కు రావాల్సిన అన్ని బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. శింగరాయకొండ బస్‌స్టేషన్ అభివద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేసిన ఆర్‌టిసి ఎమ్‌డి, సుప్రజారెడ్డి కతజ్ఞతలు తెలిపారు. దీంతో స్పందించిన సుప్రజారెడ్డి ఎపిఎస్ఆర్‌టిసి ఎమ్‌డి, సీనియర్ ఆఫీసర్, గత డీజీపీ (రైల్వేస్టేషన్) ద్వారక తిరుమలరావును కలిసి సమస్యను వివరిస్తామని తెలిపారు. బస్సులు బస్టాండ్‌లోకి వచ్చేలా చర్యలు తప్పకుండా తీసుకుంటామని హామీ ఇచ్చారు. సుప్రజారెడ్డి కలిసిన వారిలో శింగరాయకొండ అప్డేట్స్ సభ్యులు కాకసాయి తేజ, చెన్నంశెట్టి హరిబాబు, షేక్‌మస్తాన్, మొద్దు బాలాజీ తదితరులు ఉన్నారు.



బత్తుల సుప్రజా రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి 7
సోమవారం 07 ఆగస్టు 2023

రాజకీయాలకతీతంగా ప్రజాసేవ : ఏలూరి

- ఏలూరి ట్రస్ట్, రమేష్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం
- మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరానికి అనుహస్పందన
- వైద్య శిబిరానికి 2419 రోగులకు పరీక్షలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

రాజకీయాలకు అతీతంగా ప్రజా సేవకు ప్రాధాన్యతని ఇస్తున్నట్లు పర్చూరు ఎంఎల్ఎ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. స్థానిక జెడ్‌పి హై స్కూల్లో ఏలూరి నాగేశ్వరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రమేష్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరం ఆయన ప్రారంభించారు. తొలుత ఎన్టీఆర్, ఏలూరి నాగేశ్వరావు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గత 15ఏళ్లుగా ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు 2050పైగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు పౌష్టికాహారం లోపం వల్ల, ఫ్లోరైడ్ నీటి సమస్య వల్ల అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. వీటికి తోడు రసాయన మందులు వల్ల, కరోనా తర్వాత శ్వాస కోస సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. మొదటి దశలో వ్యాధులను గుర్తించకపోతే తీవ్ర పరిణామాలు ఎదురవుతున్నాయని అన్నారు. అలా గుర్తించేందుకు ఇలాంటి వైద్య శిబిరాలు ఉపయోగ పడుతాయని అన్నారు. వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ క్యాంపులో ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ జగదీష్, డాక్టర్ కార్తీక్ చౌదరి మాట్లాడుతూ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్డియాలజీ, న్యూరాలజీ, గ్యాస్ట్రోఎంట్రాలజీ, యూరాలజీ, పల్మనాలజీ, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, అంటు వ్యాధుల వైద్య నిపుణులు వైద్య పరీక్షలు చేశారని తెలిపారు.

అనూహ్యస్పందన : ఉచిత మల్టీ సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఉదయం 7గంటల నుంచే ప్రజలు క్యాంపుకు బారులు తీరారు. ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించారు. నియోజకవర్గం వ్యాప్తంగా 2419మంది హాజరు హాజరయ్యారు. హాజరైన ప్రతి ఒక్కరికి బీపీ, షుగర్, రక్తపరీక్షలు చేశారు. గుండె సంబంధిత వ్యాధులున్న 200మందికి ఈసీజీ, 53మందికి ఎకో, 80మందికి పల్మనాలజీ, 300మందికి ఆర్థోపెడిక్ పరీక్షలు చేశారు. 32మందికి మోకాళ్ల ఆపరేషన్ రిఫర్ చేశారు. **అన్నదానం :** ఎమ్మెల్యే ఏలూరి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్యాంపుకు వచ్చిన అందరికీ భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు నాయుడు హనుమంతరావు, షేక్ శంషుద్దీన్, పోద వీరయ్య, సీనియర్ నాయకులు తొండపు ఆదినారాయణ, డాక్టర్ శ్యామ్, పాలేరు రామకృష్ణ, గుంజి వెంకట్రావు, రమేష్ బాబు, డాక్టర్ భరత్ పాల్గొన్నారు.


బాబు దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న వైసిపి నాయకులు

వైసిపి నిరసన - దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి - అద్దంకి

రాయలసీమ ప్రాజెక్టుల సందర్శన పేరుతో రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ చిత్తూరు పుంగనూరులో చంద్రబాబు విధ్వంసకాండ సృష్టించారంటూ పట్టణంలోని బంగ్లా రోడ్డు అంబేద్కర్ విగ్రహం వద్ద వైసిపి ఆధ్వర్యంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం చంద్రబాబు దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి నేతలు, ఛైర్ పర్సన్, వైస్ ఛైర్మన్లు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, మున్సిపల్ కౌన్సిలర్స్, వార్డు ఇంచార్జిలు, సర్పంచ్‌లు, కార్పొరేషన్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

కాలువలో మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- సంతమాగులూరు

మండలంలోని కొమ్మాలపాడు సమీపంలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్‌లో ఆదివారం ఉదయం పురుషుని మృతదేహం బయటపడింది. మృతుడు అద్దంకి పట్టణం భవాని సెంటర్‌కు చెందిన ఉంగరాల శ్రీనివాసులు(70)గా పోలీసులు గుర్తించారు. అందిన వివరాల ప్రకారం మృతుడు సుబాబుల్ తోటలలో కర్రను అమ్ముతూ, కొనడం చేస్తుంటాడు. శనివారం రాత్రి మక్కెనవారిపాలెంలోని తన బంధువుల ఇంటి నుండి టీవి ఎక్స్‌ఎల్ మోపెడ్ బండిమీద బయలుదేరాడు. సమీపంలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్ కాల్వకట్టపై కాల కృత్యాలు తీసుకునే సందర్భంలో కాల్వలో దిగి ముందుకు పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుని కోడలు శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎంవి శివకుమార్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


మందులు అందజేస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి

నులిపురుగుల మందులు పంపిణీ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

జాతీయ నులిపురుగుల దినోత్సవం ఆగష్టు 10న జరుగనున్న సందర్భంగా భట్టిప్రోలు, వెల్లటూరు పి హెచ్‌సిల ఆధ్వర్యంలో హెచ్‌ఎంలకు అల్బెన్డజోల్ మందులను ఎంపిపి డివి లలిత కుమారి, జెడ్పిటిసి ఉదయ్ భాస్కర్ పంపిణీ చేశారు. వివిధ పాఠశాలల హెచ్‌ఎంలకు వీటిని అందజేస్తున్నట్లు ఎంఇఓలు పులి లాజర్, ఎన్ దేవరాజ్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పద్మజ, రామలక్ష్మి, ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖర్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి - పర్చూరు

రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ప్రకటనను డైరెక్టర్ అయ్యూబ్ హుస్సేన్ విడుదల చేసినట్లు పర్చూరు ఇంచార్జి కరీం బాష ఆదివారం తెలిపారు. ఈనెల 17లోపు స్థానిక ఉర్దూ అకాడమీ శిక్షణా కేంద్రంలో అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన 40ఏళ్లలోపు స్త్రీ, పురుషులు అర్హులని తెలిపారు. శిక్షణ అనంతరం స్కిల్ డెవలప్మెంట్ వారిచే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 8341471407, 9533477797 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు.


చంద్రబాబుతో బాపట్ల ఇన్‌ఛార్జి రేంద్రవర్మ

చంద్రబాబుతో నరేంద్ర వర్మ

ప్రజాశక్తి - బాపట్ల

ప్రకాశం జిల్లా మల్లవరం గుండ్లకమ్మ ప్రాజెక్ట్ సందర్శనకు విచ్చేసిన టిడిపి అధినేత చంద్రబాబును టిడిపి బాపట్ల ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ కలిశారు. వైసీపీ ప్రభుత్వంలో సాగునీటి ప్రాజెక్టులపై జరుగుతున్న విధ్వంసంపై రైతులకు వివరిస్తూ ఆదివారం మల్లవరం ఆదివారం యుద్ధభేరిలో భాగంగా గుండ్లకమ్మ ప్రాజెక్టును పరిశీలించారు.

రానున్న ఎన్నికల్లో ఆదరించండి

ప్రజాశక్తి - చీరాల

రానున్న ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు కోరారు. స్థానిక విట్టల్ నగర్‌లోని గోచిపాతల ప్రసాద్ నివాసం వద్ద ఆయన కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ డాక్టర్ పాలేటి చీరాల ఎంఎల్‌ఎగా పనిచేసిన కాలంలో దండుబాట నిర్మాణం చేయబట్టే తమ ప్రాంతానికి వరద ముప్పు తప్పిందని గుర్తు చేసుకున్నారు. ఫ్లై ఓవర్ నిర్మాణ, అంతర్గత రోడ్లు, డ్రైన్లు, తాగునీటి పైప్ లైన్ నిర్మాణం, హిందూ స్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణం చేసిరని అన్నారు. ఆరోగ్యశ్రీ పథకం లేని ఆ రోజుల్లో సీఎంఆర్‌ఎఫ్ పథకం ద్వారా గుండె ఆపరేషన్లకు డబ్బులు మంజూరు చేయించారని అన్నారు. రానున్న ఎన్నికలలో తాము పాలేటి వెంటనే నడుస్తామని అన్నారు. సమావేశంలో చెట్టుపల్లి మహేష్, తన్నీరు శ్రీనివాసరావు, దండే కృష్ణ, బూర్సు కొండయ్య, కుంచాల రాజులు, తన్నీరు వెంకటేశ్వర్లు, తన్నీరు బాలాజీ, తన్నీరు కొండలు పాల్గొన్నారు.

వృద్ధాప్యంలో ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

ప్రజాశక్తి - చీరాల

వృద్ధాప్యంలో వచ్చే ఆరోగ్య సమస్యల పట్ల శ్రద్ధవహించి, తరచు అవసరమైన ఆరోగ్య పరీక్షలను చేయించుకోవాలని చీరాల ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి సుభాషిణి కోరారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆరోగ్య సదస్సును ఆదివారం ఏర్పాటు చేశారు. ఆసుపత్రిలో అన్ని విభాగాలకు వైద్యులు, నూతన వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్ యల్లమందారెడ్డి, కట్టా రాజ్ వినయ్ కుమార్, ఎ నాగవీరభద్రాచారి, రామారావు, శివప్రసాద్, నారాయణరావు, జగన్మోహనరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం దీక్ష

ప్రజాశక్తి - భట్టిప్రోలు


పడుగులను పరిశీలిస్తున్న నేతలు

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికై భట్టిప్రోలు రథం సెంటర్లో సోమవారం నిరసన దీక్ష చేపట్టనున్నట్లు చేనేత కార్మిక సంఘాల ప్రతినిధులు దీపాల సత్యనారాయణ, గొట్టుముక్కల బాలాజీ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత పరిశ్రమ పట్ల అవలంభిస్తున్న విధానాలతో చేనేత రంగం సంక్షోభంలో కురుక పోయిందన్నారు. నేతన్న నేస్తం పేరుతో కార్మికులకు అందాల్సిన అనేకరకాల అలవెన్సులు, రాయితీలు దూరం చేశారని ఆరోపించారు. చేనేత అనుబంధంగా ఉన్న ఉప వృత్తులకు, షెడ్డు కార్మికులకు నేతన్న నేస్తం వర్తింప జేయాలని డిమాండ్ చేశారు. సహకార సంఘాలకు అందాల్సిన సొమ్మును విడుదల చెయ్యాలని కోరారు. చేనేత నిల్వలను ఆప్కో ద్వారా కొనుగోలు చేసి చేనేతను ఆదుకోవాలని కోరారు. ఇలాంటి సమస్యల పరిష్కారానికి చేపట్టిన దీక్షకు కార్మికులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. చేనేత పడుగుల సాగులను వారు పరిశీలించారు. వీరివెంట బట్టు నాగమల్లేశ్వరరావు, శ్రీనివాసరావు ఉన్నారు.

ట్రాఫిక్ పోస్టుకు భూమి పూజ

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

రోటరీక్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ ఆధ్వర్యంలో రోటరీ సభ్యులైన సోమేపల్లి రామమోహనరావు, వత్సవాయి రాఘవరాజుల ఆర్థిక సహకారంతో స్థూపం సెంటర్‌లో ట్రాఫిక్ పోలీస్ పోస్టు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కరి కమలేశ్వరరావు, జెట్టి వెంకటేశ్వర్లు (స్వామి), రాఘవరాజు, ఎం హనుమంతరావు, పేర్ని సత్యనారాయణ, ఎన్ హనుమంతరావు, బి వాసుదేవరావు, భవనం అంజిరెడ్డి, ఆర్కిటెక్ నాగేంద్రబాబు, ఆలీ పాల్గొన్నారు.

మోపిదేవికి సూరగాని సత్కారం

ప్రజాశక్తి - చీరాల


మోపిదేవిని సత్కారిస్తున్న సూరగాని

రాజ్యసభ సభ్యులు, బాపట్ల జిల్లా వైఎస్ఆర్‌సిపి ఇన్చార్జి మోపిదేవి వెంకట రమణరావు జన్మదినోత్సవం సందర్భంగా రేపల్లెలోని ఆయన స్వగృహానికి వెళ్లి చీరాల కౌన్సిలర్ సూరగాని లక్ష్మి, నరసింహారావు మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 4దశాబ్దాలుగా ప్రజల సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర పోషించి, బీసీ సామాజిక వర్గంలో తిరుగులేని నాయకులుగా ఎదిగిన మోపిదేవి భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. వారి వెంట చెరుకుపల్లి వైసిపి నాయకులు వారే చంద్రశేఖర్‌రెడ్డి, యన్ సూర్యచంద్ర, ఆర్‌టిజీఎస్ నాగార్జున తదితరులు జీడిపప్పు మాలతో మోపిదేవి దంపతులను సత్కరించారు.

చుండూరు అమరులకు నివాళి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్


నివాళులర్పిస్తున్న నాయకులు

చుండూరు మారణకాండలో అమరులైన దళితులకు గన్నవరం రోడ్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు నివాళులు అర్పించారు. సిపిఐ (ఎంఎల్) రెడ్ స్టార్ కేంద్ర కమిటీ సభ్యులు మహ్మద్ బాషా, సమతా సైనిక్ దళ్ పర్చూరు కన్వీనర్ బొల్లాపల్లి బెంజిమెన్ మాట్లాడుతూ వేల సంవత్సరాలుగా విద్యకు, సంపదకు దూరమైన దళితులు అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా పొందిన రిజర్వేషన్ల ఫలితంగా కొంతమేరకైనా అభివృద్ధి సాధించారని అన్నారు. నూతన దళిత తరం స్వేచ్ఛా యుత, ఆత్మగౌరవ ఆలోచనలను సహించలేని అగ్ర కుల పెత్తందార్లు చేసిన మారణహోమమే చుండూరు ఘటనని అన్నారు. ఆత్మగౌరవ, ఆత్మరక్షణ పోరాటాల సంప్రదాయాన్ని కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ నాయకులు విజయ్, ఎఐఆర్‌డబ్ల్యూఎ రాష్ట్ర కార్యదర్శి సుజాత, తస్లీమా నస్రీన్, టైలర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాదర్‌వలి, కెవిపిఎస్ నాయకులు విజయ్ కుమార్, పదమూర్తి బిక్షాలు, జెట్టి స్వామి, అంజి, ఇర్మియా పాల్గొన్నారు.



పర్చూరులో క్రైస్తవ, మహిళా సంఘాల శాంతి ర్యాలీ

మణిపూర్ ఘటనలపై నిరసన

ప్రజాశక్తి - పర్చూరు

మణిపూర్ ఘటన సమాజం తలదించుకునేలా ఉందని క్రైస్తవ, మహిళా సంఘాలు ఆరోపించాయి. ఘటనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. క్రైస్తవ, మహిళా సంఘాల ఆధ్వర్యంలో పర్చూరులో ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఇద్దరు కుకీ మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారం చేసిన మైతీ వర్గీయులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. యావత్ దేశం సిగ్గుపడాల్సిన ఘటనని దళిత నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండ చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈకార్యక్రమంలో దళిత నాయకులు వడిముక్కల అబ్రహం, నలిగల కిషోర్, జూపూడి రోశయ్య, కంభం మార్కు, జూపూడి మార్కు, గేరా స్వరాజ్ కుమార్, మత్తె డేవిడ్ పాల్గొన్నారు.

250 మందికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి - కర్లపాలెం

ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా మండలంలోని యాజలి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 1982-83, 1983-84లో 10తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో విజయవాడ సెంటిని హాస్పటల్ డాక్టర్లు కార్డియాలజిస్ట్ కిరణ్, డాక్టర్ శ్రీపతి 250మందికి ఉచితంగా వైద్యపరీక్షలు చేసి మందులు అంద జేశారు.

కబళిస్తున్న కిడ్నీ వ్యాధి

- కుమారుడికి రెండు కిడ్నీలూ మార్చాల్సిన పరిస్థితి..
- తండ్రి చిరుద్యోగి కావడంతో అందని ఉచిత వైద్యం
- దాతల సాయం కోసం ఎదురుచూపు



చంద్రకాంత్ (ఫైల్)

ప్రజాశక్తి-పిసిపల్లి

ఆ తండ్రీ కొడుకులిద్దరూ వ్యాధుల బారిన పడ్డారు. కొడుకు కిడ్నీ వ్యాధితో బాధ పడుతుండగా తండ్రి బిపి, షుగర్ లాంటి పలు వ్యాధులతో బాధపడుతున్నారు. 37 సంవత్సరాలుగా చిన్నపాటి ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నా ఎదుగూ బొదుగూ లేని జీవితం. సాయం అందించకపోతే తన బిడ్డ దక్కడనే బాధ ఓ వైపు వెంటాడుతోంది. మరోవైపు తాను కూడా నాలుగు రకాల జబ్బులతో అల్లాడుతూ బాధను దిగమింగుతూ కాలం గడుపుతున్నాడు. బాధితుల వివరాల ప్రకారం.. కనిగిరిలో నివాసముంటున్న సిహెచ్ వెంకటేశ్వర్లు పిసిపల్లి మండలంలో ఆర్‌డబ్ల్యుఎస్ శాఖలో పంపు మెకానిక్‌గా పని చేస్తున్నాడు. వెంకటేశ్వర్లు 15 సంవత్సరాలుగా బిపి, షుగర్ వ్యాధులతో బాధపడుతున్నాడు. బోరు మెకానిక్ కావడంతో రెండు సంవత్సరాల నుంచి వెన్నుపూస దెబ్బతిన్నది. వీటికి తోడు నాలుగు నెలల నుంచి గుండె జబ్బు కూడా తోడైంది. 1986లో రూ.300 నెల జీతంతో కాంట్రాక్టు పద్ధతిపై టైమ్‌స్కేల్ పద్ధతిలో బోరు మెకానిక్‌గా చేరారు. ప్రస్తుతం వెంకటేశ్వర్లుకు రూ.33 వేలు వేతనం. ఇంతకుమించి ఎలాంటి ప్రభుత్వ సౌకర్యాలూ లేవు. వెంకటేశ్వర్లుకు ఇద్దరు కుమారులు. బిటెక్ వరకూ చదువుకున్న చిన్నకుమారుడు చంద్రకాంత్ ఆరు నెలల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రెండు నెలల క్రితం డాక్టర్ వద్దకు తీసుకెళ్లగా రెండు కిడ్నీలు చెడిపోయాయన్న విషయం బయటపడింది. కిడ్నీలు మార్పిడి చేయాలంటే రూ.35 లక్షలు అవసరమవుతాయని వైద్యులు తెలిపారు. ఈ వార్తతో వెంకటేశ్వర్లుపై పిడుగుపడినట్లైంది. తన జబ్బులకే జీతం సరిపోక అప్పులు చేశాడు. కొడుకు జబ్బు తెలియడంతో దిక్కుతోచని స్థితిలో ఉండి దాతల కోసం ఎదురు చూస్తున్నాడు. కొడుకు ఆసుపత్రిలో అత్యవసర విభాగంలో ఉన్నారు. ఒకవైపు అనారోగ్యం, మరోవైపు డ్యూటీ చేయడం మూలంగా రోజురోజుకూ ఆరోగ్యం క్షీణిస్తోంది. కొడుకును బతికించుకోవాలనే తపన ఉంది. వెంకటేశ్వర్లుకు పిసిపల్లి మండలంతోపాటు కనిగిరి పరిసర ప్రాంతాల్లో మంచి కళాకారుడనే గుర్తింపు కూడా ఉంది. కనిగిరి ప్రాంతంలో జానపద, పౌరాణిక నాటకాల్లో నటిస్తూ ఆయా పాత్రలకు జీవం పోసేవాడు. కుమారుడు కిడ్నీ వ్యాధి విషయం తెలియడంతో కుటుంబం మొత్తం దిగాలుపడింది. తన ఉద్యోగ జీవితకాలంలో మిగిలించిందేమీ లేదు. వేసవి కాలంలో బోర్లు రిపేర్లు చేసే సమయంలో కూడా ఆరోగ్యం దెబ్బతింది. ఈ విధంగా చేతిపంపులు మరమ్మతులు చేస్తూ తాను అనారోగ్యంపాలు కావడంతో తన కుమారుడు దీనావస్థను చూసి మనోవేదన చెందుతున్నారు. తనకు రూ.33 వేలు జీతం వస్తున్నందున ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం కాని, ఉచిత వైద్యం కాని అందడం లేదని ఆవేదన చెందుతున్నాడు. దొరికిన చోటల్లా అప్పులు చేసినప్పటికీ మాత్రలకు కూడా సరిపోవడం లేదని ఆందోళన చెందుతున్నాడు. తన కుమారుడికి తక్షణమే కిడ్నీలు మార్చాలని వైద్యులు హెచ్చరించినప్పటికీ డబ్బులు దొరకక చేయించలేదని ఆవేదనగా తెలిపాడు. ఎవరైనా దాతలు సాయం చేయాలని కోరుతున్నాడు. తన సెల్: 9542941711 నెంబర్‌కు ఆర్థిక సాయం చేసి తమ బిడ్డ ప్రాణాలను కాపాడాలని వెంకటేశ్వర్లు కోరుతున్నాడు.

మత్తు పదార్థాల నిషేధం కోసం

ప్రజాతంత్రవాదులతో కలిసి ఉద్యమం

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి పిలుపు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మహిళలపై జరుగుతున్న హింసకు కారణమవుతున్న మద్యం మత్తు పదార్థాలను నిర్మూలించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. రమాదేవి పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా రానున్న కాలంలో విశాల వేదికగా అనేక మహిళా సంఘాలని, ప్రజాతంత్ర వాదులని కలుపుకొని ఉద్యమాలు సాగిస్తామని తెలిపారు. ఐద్వా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జూలై 28న ప్రారంభమైన హింసపై మహిళల పోరుయాత్ర జాత ఆదివారం ఒంగోలు చేరుకుంది. ఒంగోలు 60 అడుగుల రోడ్డు జంక్షన్ కు చేరిన జాతాకు స్థానిక ఐద్వా కార్యకర్తలు మహిళలు పూలు చల్లి ఘన స్వాగతం పలికారు. సందర్భంగా జరిగిన సభకు ఐద్వా నగర కార్యదర్శి జి.ఆదిలక్ష్మి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షర్మిల, నగర నాయకులు బి.రాజ్యలక్ష్మి, కె.సజన, కె.రాజేశ్వరి, వై అంజనాదేవి, జి కళ్యాణి, బి రంగమ్మ, జి నాగమ్మ, బి పెద్ద గోవిందమ్మ, ఎస్ కే నాగూర్ బి, ఎన్ మాలతి, బి పద్మ పాల్గొన్నారు.



కనిగిరిలో బహిరంగ సభలో మాట్లాడుతున్న డి.రమాదేవి

కనిగిరి: ఆగష్టు 8న విజయవాడలో జరిగే బహిరంగ సభకు గ్రామీణ ప్రాంతాల నుంచి భారీగా మహిళలు తరలిరావాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి కోరారు. కనిగిరిలోని పామూరు బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం బహిరంగ సభ నిర్వహించారు. రమాదేవి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న నేరాలను అధ్యయనం చేయటానికి నిపుణులతో కమిటీ వేయాలన్నారు. కార్యక్రమంలో కోశాధికారి సావిత్రి, జిల్లా అధ్యక్షులు యస్‌డి షమ్మీ, కార్యదర్శి కె.రమాదేవి, కనిగిరి అధ్యక్షులు ఎస్‌కె.బషీరా, కార్యదర్శి ప్రసన్న పాల్గొన్నారు.

కొండపి: మహిళలపై జరిగే హింసకు ప్రధాన కారణమైన మద్యం, మత్తు పదార్థాలను వెంటనే నిషేధించాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో అనంతపురం నుంచి బయలుదేరిన హింసపై మహిళల పోరు యాత్ర జాతా కొండపి మండలంలోకి ప్రవేశించింది. కామ్రేడ్ ముప్పరాజు శేషయ్య స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా కొండపిలోని గురుకుల పాఠశాలలో పోరు యాత్ర నిర్వహించారు. అక్కడ విద్యార్థులకు పాటలు ద్వారా, నాట్యం ద్వారా మహిళలపై జరుగుతున్న హింసాకాండను వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, అధ్యక్షులు షమ్మీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, రాష్ట్ర కమిటీ సభ్యులు కెజి మస్తాన్ పాల్గొన్నారు.

సంతనూతలపాడు: సమాజం ఆధునికంగా ఎంతో మార్పు చెందుతున్నా మహిళలకు సమానత్వం నేటికీ లభించకపోవడం సిగ్గుచేటని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి అన్నారు. ఐద్వా పోరు యాత్ర సంతనూతలపాడు వచ్చిన సందర్భంగా బస్టాండ్ సెంటర్లో స్థానిక ఐద్వా కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. జాతాకు ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి నాయకత్వం వహించారు. జాతాలో సంతనూతలపాడు మండల ఐద్వా నాయకులు యస్.కె.నాగూర్బి, బంకా పద్మ, ఏ బసవమ్మ, ఏ రవణమ్మ పాల్గొన్నారు. పోరు యాత్ర జాతకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ తరపున మాచవరంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నెరుసుల వెంకటేశ్వర్లు, కంకణాల ఆంజనేయులు స్వాగతం పలికారు. యాత్ర బందానికి వాటర్ బాటిల్స్‌ను అందజేశారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలకోటయ్య మద్దతు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కేజీ మస్తాన్, మండల కార్యదర్శి అన్నవరపు శేషారావు, ఆదెమ్మ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అవగాహన అవసరం

ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ అబ్బూరి రవీంద్రబాబు

ప్రజాశక్తి-పొదిలి

గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు చేరువలో ఉండే ఆర్‌ఎంపిలు అన్ని రకాల వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఒంగోలుకు చెందిన ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ అబ్బూరి రవీంద్రబాబు చెప్పారు. ఆదివారం ఒంగోలులోని లక్ష్మి సూపర్‌స్పెషాలిటీ వైద్యశాల ఆధ్వర్యంలో స్థానిక ఒంగోలు రోడ్డులోని లక్ష్మి శ్రీనివాస వైద్యశాలలో పొదిలి తాలూకా పరిధిలోని ఆర్ ఎంపి వైద్యులకు అవగాహన సదస్సు జరిగింది. అబ్బూరి మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాథమిక చికిత్స కోసం వచ్చే రోగుల విషయంలో.. వారికి ఎటువంటి ప్రాణాపాయం లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ఎప్పటికప్పుడు రోగులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆర్‌ఎంపిలదే అన్నారు. దీర్ఘకాలిక రోగాలను గుర్తించడం, ఇతర వ్యాధుల పట్ల అవగాహన, వాటి నివారణ పద్ధతులపై ఆయన అవగాహన కల్పించారు. ఎటువంటి అత్యవసర పరిస్థితుల్లో అయినా ఒంగోలులో తమ వైద్యశాలలో అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంపిల సంఘం జిల్లా అధ్యక్షులు బట్టు బాలాజీ, ఉపాధ్యక్షులు సయ్యద్ ఇమాం సాహెబ్, పొదిలి, కెకెమిట్ల, మర్రిపూడి, బేస్తవారిపేట ఆర్‌ఎంపిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ అబ్బూరి రవీంద్రబాబు

రైల్వే స్టేషన్ల ఆధునీకరణతో

కొత్త చరిత్రకు శ్రీకారం

ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి -ఒంగోలు కలెక్టరేట్

రైల్వే స్టేషన్ల ఆధునికీకరణలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారని ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. అమత్ భారత్ పథకంలో చేపట్టిన రైల్వే స్టేషన్ల అభివద్ధి కార్యక్రమానికి సంబంధించి ఒంగోలు రైల్వే స్టేషన్ లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాగుంట శ్రీనివాసులురెడ్డి, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, రైల్వే అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలుత విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగాన్ని వీరు ఎంతో ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఒంగోలు రైల్వే స్టేషన్ ఆధునికీకరణకు సంబంధించిన శిలా ఫలకాన్ని అతిథులు ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఒంగోలు రైల్వేస్టేషన్లో ప్రతిరోజు సుమారు 16 వేలమంది ప్రయాణికులతో 74 రైళ్ల సర్వీసులు రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. ఈ స్టేషన్ ను దాదాపు రూ. 19.1 కోట్ల వ్యయంతో అమత్ భారత్ స్టేషన్ స్కీంలో అభివద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధమైందన్నారు. అభివద్ధి చేయబడిన తరువాత సదుపాయాల పరంగా సరికొత్త ఉత్తమ శ్రేణి రైల్వే స్టేషన్ గా ఒంగోలు రూపాంతరం చెందుతుందని తెలిపారు. ఒంగోలు మేయర్ మాట్లాడుతూ పెరుగుతున్న నగర జనాభా అవసరాలు, ఆకాంక్షలకు తగిన విధంగా కొత్త హంగులతో ఒంగోలు రైల్వే స్టేషన్ ను పునరాభివద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో సీనియర్ డిఈఎన్ (కోఆర్డినేషన్) పివి రమణ రావు, ఏపిఒ(జనరల్ – విజయవాడ) పి.శ్రీనాథ్, ఏడిఎస్ (ఒంగోలు) డి.జగదీష్, పాల్గొన్నారు.